


అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

08.09.2026

మంగళవారం| రంగారెడ్డి

సంపుటి : 01 | సంచిక: 70

పేజీలు : 08 | వెల: రూ.5

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


# అసెంబ్లీ ముట్టడి.. రాంచందర్‌రావు అరెస్ట్

- రాంచందర్‌రావును అదుపులోకి తీసుకున్న పోలీసులు
- గన్‌పార్క్ వద్ద బీజేపీ శ్రేణుల ఆందోళన
- పోలీసులు, కార్యకర్తల మధ్య తోపులాట 2లో..



# అసెంబ్లీ ముందు బీఆర్ఎస్ నేతలు టీషర్టులు విప్పి బనియన్లపై నిరసన

- అదుపులోకి తీసుకున్న పోలీసులు
- పోలీసులు, బీఆర్ఎస్ మధ్య తోపులాట





**హైదరాబాద్, సెప్టెంబర్ 07, అనంత జనశక్తి న్యూస్**

అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకున్నారు. నినాదాలు రాసి ఉన్న నల్ల టీషర్టులతో బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీ ప్రాంగణంలోకి ప్రవేశించేందుకు యత్నించారు. పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో టీషర్టులు విప్పి హరీశ్‌రావు, పలువురు ఎమ్మెల్యేలు బనియన్లతో అక్కడే నిరసన తెలిపారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. హరీశ్‌రావుతోపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు అసెంబ్లీ ప్రవేశ ద్వారం వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి కన్నీళ్లు పెట్టుకున్నారు. పోలీసులు తనపట్ల అమానుషంగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసనల మధ్య మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి స్పృహతప్పి పడిపోయారు. 2లో..

# తప్పనిసరిగా పూర్తి చేయాల్సిందే

- మంత్రి నారా లోకేశ్
- పార్టీ అప్పగించిన పనులను పూర్తి చేయాలి
- పార్టీ పదవుల్లో ఉన్న వారిని గౌరవించాల్సిందే
- మంత్రులైనా.. ఎమ్మెల్యేలైనా సరే..
- మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో వర్క్‌షాప్

**మంగళగిరి, సెప్టెంబర్ 07, అనంతజనశక్తి న్యూస్**

పార్టీయే సుప్రీం అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ స్పష్టం చేశారు. పార్టీ పదవుల్లో ఉన్న వారిని మంత్రులైనా.. ఎమ్మెల్యేలైనా గౌరవించాల్సిందేనని ఆదేశించారు. తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలకు సోమవారం, మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో రెండు రోజుల పాటు జరగనున్న ఈ వర్క్‌షాప్‌లో లోకేశ్ పాల్గొని ప్రసంగించారు.



2లో..

# కేసీఆర్ స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలి

- తాతా మధును డిస్మిస్ చేయాలి: రేవంత్
- 22Aపై చర్చ తర్వాతే నిర్ణయాలు: రేవంత్
- బీజేపీ "చీకటి మిత్రుడిని" కాపాడుతోంది: సీఎం
- స్పీకర్‌ను అవమానించడం సభకే అవమానం
- కాళేశ్వరం, భూములు, విద్యుత్‌పై చర్చ తర్వాతే విచారణ
- "పోరాటం కమ్యూనిస్టులది.. పరిష్కారం కాంగ్రెస్‌ది"
- 2029లో మోదీ ఓటమికి 2026 నుంచే అడుగులు: సీఎం



**హైదరాబాద్, సెప్టెంబర్ 08, అనంతజనశక్తి న్యూస్**

శాసనసభలో బీజేపీ సభ్యుల తీరుపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 22A అంశంపై చర్చిస్తామని ముందే చెప్పామని, సభలో చర్చ జరిగిన తర్వాతే నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బీజేపీ సభ్యులు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు. బీజేపీ తన "చీకటి మిత్రుడిని" కాపాడేందుకు ప్రయత్నిస్తోందని సీఎం ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సభలో విచారణకు ఆదేశించామని తెలిపారు. భూముల వ్యవహారాలు, విద్యుత్ కొనుగోళ్లపై కూడా సభలో చర్చ జరిగిన తర్వాతే విచారణకు ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. 2లో..

"చర్చ లేకుండా ఉరి శిక్ష వేయాలని అనడం సరికాదు" అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. బీజేపీ సభ్యులు చెప్పాలనుకున్న అంశాలపై చర్చించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, ఆ విషయాలను బీఏసీలో ప్రస్తావించాలని సూచించారు. సభలో షార్ట్ డిస్కషన్‌కు తీసుకుంటామని చెప్పిన తర్వాత కూడా ఆందోళన చేయడం ఎందుకని ప్రశ్నించారు. సభలో సభ్యులకు ఏదైనా జరిగినప్పుడు వారిని కాపాడాల్సిన బాధ్యత స్పీకర్‌పై ఉంటుందని సీఎం అన్నారు. అలాంటి స్పీకర్ స్థానానికే అవమానం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్పీకర్‌కు జరిగిన అవమానం ఒక్క వ్యక్తికి జరిగినది కాదని, సభలోని సభ్యులందరికీ జరిగిన అవమానమని పేర్కొన్నారు. స్పీకర్ స్థానానికి ఎంతో గౌరవం ఉందని, సభలో సభ్యుల గౌరవంతో పాటు ప్రజల గౌరవాన్ని కూడా కాపాడాల్సిన బాధ్యత ఉందని రేవంత్ రెడ్డి అన్నారు.

"సభాపతిపై సభ్య సమాజం సహించలేని మాటలు మాట్లాడతారా?" అని ప్రశ్నించారు. సమాజం తలవంచుకునేలా మాట్లాడితే అది మొత్తం శాసనసభకే అవమానమని వ్యాఖ్యానించారు. సభా నాయకుడిగా తాను హామీ ఇస్తున్నానని, బీజేపీ సభ్యులు తమ స్థానాల్లో కూర్చోవాలని సీఎం కోరారు. వారు చెప్పాలనుకున్న అంశాలను సభలో చర్చకు తీసుకెళ్లేందుకు అవకాశం ఇస్తామని తెలిపారు. నిన్న ఫామ్‌హౌస్‌కు పిలిచి బీజేపీ సభ్యులను రెచ్చగొట్టి పంపించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. సభలో జరిగిన పరిణామాలు సభ్య సమాజం క్షమించరాని నేరమని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

**తాతా మధును డిస్మిస్ చేయాలి: రేవంత్‌రెడ్డి**


శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు అవమానం జరిగిన నేడు.. తెలంగాణకు చీకటి రోజని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో శాసనసభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "ఈరోజు నాలుగు కోట్ల ప్రజలకు అవమానం జరిగింది.

# యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం

- 12 మంది దుర్మరణం
- బాగ్‌పత్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం 2లో..
- 32 మందితో వెళ్తున్న పికప్ బోల్తా
- డివైడర్‌ను ఢీకొట్టడంతో అదుపుతప్పిన వాహనం

# కొత్త పార్టీపెడ్తున్న

- సీఎం క్యాండిడేట్ మాత్రం వేరే వారు!
- మాజీ మంత్రి విజయసాయి రెడ్డి
- అజెండాలను ప్రజల ముందుకు తీసుకొస్తా
- ప్రజల క్షేమమే ధ్యేయంగా ముందుకు



2లో..

# తక్కువ ధరకే నిత్యావసరాలు

- ప్రత్యేక రైస్ అవుట్‌లెట్ ప్రారంభం
- మంత్రి నాదెండ్ల మనోహర్
- తెలుగు ప్రజలందరికీ స్వచ్ఛమైన..
- మన ఊరి రుచులను, వరి వంగడాలను అందిస్తాం




2లో..

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 07, అనంతజనశక్తి న్యూస్**

దేశ రాజధాని న్యూఢిల్లీలో నివసిస్తున్న రాష్ట్ర ప్రజలకు తక్కువ ధరకే అత్యుత్తమ నాణ్యతతో కూడిన బియ్యం, నిత్యావసర సరుకులను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల కార్పొరేషన్ ఆధ్వర్యంలో, రెసిడెంట్ కమిషనర్ చొరవతో ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక రైస్ అవుట్‌లెట్‌ను పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు.

# రాజకీయ నాయకుల్ని వెంటనే అరెస్ట్ చేయండి

- డాక్టర్లపై దాడి చేసే సహించేది లేదు
- సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు 2లో..



# అసెంబ్లీలో సీఎం విజయ్ విశ్వరూపం

- డీఎంకేపై తీవ్ర స్థాయిలో ఫైర్ 2లో..
- స్టాలిన్, ఉదయనిధి స్టాలిన్‌లపై ఫైర్



# మారు పేర్ల సమస్యకు శాశ్వత పరిష్కారం

- డిప్యూటీ సీఎం భట్టి
- 128 మంది కార్మికుల సమస్యపై కమిటీ 2లో..
- మానవీయ కోణంలో పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం
- 1997 నుంచి కొన సాగుతున్న సమస్య
- కమిటీ సిఫార్సుల ఆధారంగా నిర్ణయం
- నివేదిక రాగానే పరిష్కారం



**హైదరాబాద్, సెప్టెంబర్ 07, అనంత జనశక్తి న్యూస్**

శాసనమండలిలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సింగరేణి కాలరీస్‌లో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న మారుపేర్ల సమస్యపై కీలక ప్రకటన చేశారు. ఈ సమస్యను మానవీయ కోణంలో పరిశీలించి పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లో పెండింగ్‌లో ఉన్న మారుపేర్ల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ఒక కమిటీని ఏర్పాటు చేసిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. కమిటీ సమర్పించే సిఫార్సుల ఆధారంగా స్పష్టమైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

# స్వర్ణభారత్ ట్రస్ట్ కృషి అమోఘం



2లో..

# ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి

- డీఎస్సీలో భారీగా అక్రమాలు 2లో..
- వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి
- డీఎస్సీలో అంతులేని అక్రమాలు
- కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం వహించింది లోకేష్

# అసెంబ్లీ ముట్టడి.. రాంచందర్‌రావు అరెస్ట్

**హైదరాబాద్, సెప్టెంబర్ 07, అనంత జనశక్తి న్యూస్**

తెలంగాణ అసెంబ్లీ ముట్టడికి యత్నించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో అక్కడ తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. సోమవారం ఉదయం నుంచి దశలవారీగా అసెంబ్లీ ముట్టడికి వస్తున్న బీజేపీ శ్రేణులను పోలీసులు ఎప్పటికప్పుడు అరెస్ట్ చేస్తున్నారు. వరుసగా అసెంబ్లీ ముట్టడికి కమలం పార్టీ నేతలు రావడంతో అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొంది. మరోసారి అసెంబ్లీ ముట్టడికి బీజేపీ యత్నించడంతో.. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు సహా పలువురు కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.రాంచందర్‌రావు అరెస్ట్ సందర్భంలో తోపులాట చోటు చేసుకుంది. దీంతో గన్‌పార్క్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. బీజేపీ తెలంగాణ చీఫ్‌ను పోలీసులు తీసుకెళ్లకుండా రోడ్డుపై పడుకుని మరీ బీజేవైఎం నేతలు నిరసనకు దిగారు. రాంచందర్ రావును తీసుకెళ్తున్న పోలీస్ వాహనంపైకి బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్‌కుండే ఎక్కడంతో.. వెంటనే పోలీసులు అతడిని లాగి పడేశారు. ఆ వెంటనే పలువురు కార్యకర్తలు కారుకు అడ్డంగా పడుకున్నారు. పోలీసులు వారిని చెదరగొట్టి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని అక్కడి నుంచి తీసుకెళ్లేందుకు యత్నించారు. దీంతో అసెంబ్లీ వద్ద బీజేపీ నేతలు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో ఇద్దరు కార్యకర్తలకు చేతులు విరగగా, పలువురు కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు యత్నిస్తున్నారు. వరుసగా బీజేపీ నేతల ముట్టడితో అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో హైటెన్షన్ నెలకొంది.

# అసెంబ్లీ ముందు బీఆర్ఎస్ నేతలు టీషర్టులు విప్పి బనియన్లపై నిరసన

(మొదటి పేజీ తరువాయి)

మరోవైపు బీఆర్ఎస్ సభ్యుల నిరసనపై పోలీసులు స్పందించారు. అసెంబ్లీ ప్రాంగణం వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ధరించిన బ్లాక్ టీషర్టులపై అభ్యంతరకర పదాలు ఉండటంతో అనుమతి ఇవ్వలేదని ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పావళి తెలిపారు. ''బ్లాక్ టీషర్ట్ వేసుకోవడం నేరం కాదు. వాటిపై ఉన్న పదాల కారణంగానే లోపలికి అనుమతించలేదు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో పోలీసులు అసభ్యంగా ప్రవర్తించలేదు. పోలీసుల తీరుపై బీఆర్ఎస్ నేతలు చేస్తోన్న ఆరోపణలను పరిశీలిస్తాం. అసెంబ్లీ గేటు దగ్గర జరిగిన ఘటనకు సంబంధించిన వీడియోలను పరిశీలిస్తాం. స్పీకర్ సూచనల మేరకే పోలీసులు వ్యవహరించారు'' అని తెలిపారు.

# తప్పనిసరిగా పూర్తి చేయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ ఏదైనా పని చెబితే.. దానికే ప్రయారిటీ ఇవ్వాలని మంత్రి లోకేశ్ దిశానిర్దేశం చేశారు. క్వాంటం టవర్స్‌కు సంబంధించిన ఓ కార్యక్రమం ఉందని తనను ఆహ్వానిస్తే... పార్టీ తనకో పని అప్పచెప్పిందని... తాను రానని స్పష్టం చేశానని పేర్కొన్నారు. పార్టీ ఇచ్చిన పనులను తప్పనిసరిగా పూర్తి చేయాల్సిందే... దానికే హై ప్రయారిటీ ఇవ్వాలని ఆదేశించారు. పార్టీ పదవుల్లో ఉన్న వారు.. పార్టీ కార్యక్రమాలకు హాజరు కావడానికి ఎవరి అనుమతి అవసరం లేదని క్లారిటీ ఇచ్చారు. పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న చంద్రబాబు బీఫారం ఇవ్వకుంటే మంత్రులు కాలేరని, ఎమ్మెల్యేలు కారని తేల్చిచెప్పారు.

**మై-టీడీపీ యాప్‌లో పార్టీ కార్యక్రమాల వివరాలను అప్‌డేట్ చేస్తున్నాం..**

పార్టీని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు ఉండదనే విషయాన్ని.. ప్రతి క్షణం గుర్తుంచుకోవాలని మంత్రి లోకేశ్ సూచించారు. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాలు ఏ విధంగా జరుగుతున్నాయనేది.. నిరంతరం సమీక్షించుకుంటూ టీడీపీ కేడర్ వెళ్లాలని సూచించారు. మైటీడీపీ యాప్‌లో పార్టీ కార్యక్రమాల వివరాలను పూర్తిగా అప్‌డేట్ చేస్తున్నామని వెల్లడించారు. ఆ సమాచారం ఆధారంగా పార్టీ కార్యక్రమాల నిర్వహణపై ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని మంత్రి నారా లోకేశ్ మార్గనిర్దేశం చేశారు.

# యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం

**లక్నో, సెప్టెంబర్ 07, అనంత జనశక్తి న్యూస్**

ఉత్తర్ ప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బాట్‌పత్ జిల్లాలో 32 మంది ప్రమాణికులతో వెళ్తున్న పికప్ ట్రక్ డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 12 మంది మరణించగా, 16 మందికి పైగా గాయపడినట్లు అధికారులు తెలిపారు. సోమవారం తెల్లవారుజామున ఖేక్రా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈస్టర్న్ పెరఫెరల్ ఎక్స్‌ప్రెస్ వేపై ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో రాజస్థాన్ నుంచి బదాయూన్ వెళ్తున్న ప్రయాణికులు ఉన్నారు. వీరు రాజస్థాన్ లోని బాగడ్ ధామ్ నుంచి తిరిగి వస్తున్న భక్తులని పోలీసులు తెలిపారు.

ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరారు. ప్రమాద సమయంలో చాలా మంది ప్రయాణికులు నిద్రలో ఉన్నారని తెలుస్తోంది. ఒక్కసారిగా భారీ శబ్ధంతో వాహనం బోల్తా పడిందని, ఆ తర్వాత క్షతగాత్రులు ఆర్తనాదాలు వినిపించాయని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. వెనక నుంచి వచ్చని మరో వాహనం ఢీకొట్టడంతోనే పికప్ వాహనం డివైడర్‌ను ఢీకొట్టినట్లు డ్రైవర్ చెబుతున్నాడు. అయితే డ్రైవర్ చెప్పింది నిజమా అని పోలీసులునిర్ధారించాల్సి ఉంది.

# కొత్త పార్టీపెడ్తున్న

**అమరావతి, సెప్టెంబర్ 07, అనంతజనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. వైఎస్సార్‌సీపీ మాజీ నాయకుడు విజయసాయిరెడ్డి కొత్త రాజకీయ పార్టీ స్థాపనపై సంచలన వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే తన నూతన పార్టీ జెండా, అజెండాలను ప్రజల ముందుకు తీసుకువస్తానని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజల క్షేమమే ధ్యేయంగా ఈ కొత్త ప్రత్యామ్నాయ శక్తులు రూపుదిద్దుకుంటున్నాయని వెల్లడించారు.

రాష్ట్రంలో గత కొన్ని సంవత్సరాలుగా ప్రధాన పార్టీలైన తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్ చుట్టూనే రాజకీయం తిరుగుతోందని విజయసాయిరెడ్డి ఆరోపించారు. ఈ రెండు పార్టీలు ప్రజల సంక్షేమాన్ని పక్కనపెట్టి ఫ్యాక్షన్ రాజకీయాలకు తెరతీశాయని విమర్శించారు. ఒక వైపు రెడ్ బుక్ పాలన సాగిస్తున్న టీడీపీ, మరోవైపు రప్పా రప్పా సంస్కృతిని ప్రోత్సహిస్తున్న వైసీపీల మధ్య యుద్ధం జరుగుతోందని దుయ్యబట్టారు.

అధికార మార్పిడి కేవలం ఈ రెండు పార్టీల మధ్యే మారుతుందన్న భావన ప్రజల్లో నెలకొందని, దీనివల్ల సామాన్యులు తీవ్రంగా నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై పోరాడే విషయంలో సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, బీజేపీ, జనసేన వంటి ఇతర పార్టీలు పూర్తిస్థాయిలో విఫలమయ్యాయని, అందుకే తాను కొత్త వేదికను సిద్ధం చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు.

రాష్ట్రంలో ఏ చిన్న పని జరగాలన్నా లంచాలు ఇచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని విజయసాయిరెడ్డి ధ్వజమెత్తారు. వ్యాపారాలు చేసుకోవాలన్నా, ఇల్లు కట్టుకోవాలన్నా, ఇసుక, మట్టి లేదా ఆస్తుల రిజిస్ట్రేషన్ల కోసమైనా ప్రజాప్రతినిధులకు, అధికారులకు, రౌడీలకు మామూళ్లు చెల్లించాల్సి వస్తోందని ఆరోపించారు.

గత ఎన్నికల్లో రూ. 20 కోట్లు, రూ. 40 కోట్లు ఖర్చు పెట్టిన నాయకులు, ఆ సొమ్మును రికవర్ చేసుకోవడంతో పాటు రాబోయే ఎన్నికల కోసం కూడబెట్టుకోవడానికే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. కక్షపూరిత రాజకీయాలను ఏపీకి తీసుకువచ్చి, అక్రమ కేసులు, అరెస్టులతో కాలం వెళ్లదీస్తున్నారని, ఏ ఒక్కరూ అభివృద్ధి ప్రాజెక్టుల గురించి మాట్లాడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలోని 6 కోట్ల మంది ప్రజలు కేవలం రెండు కుటుంబాల స్వార్థ రాజకీయాల కోసమే ఉన్నారా అని విజయసాయి రెడ్డి ప్రశ్నించారు. ఏపీలో రెడ్డి, కమ్మ వర్గాలే కాకుండా బీసీలు, కాపులు, వెలమలు, ముస్లింలు, క్రైస్తవులు పెద్ద సంఖ్యలో ఉన్నారని గుర్తుచేశారు.

# తక్కువ ధరకే నిత్యావసరాలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. మన రైతాంగం కష్టపడి పండించిన ధాన్యం రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా జాతీయ స్థాయిలోనూ అద్భుతమైన గుర్తింపు తెచ్చుకుందని కొనియాడారు. ముఖ్యంగా ఢిల్లీ నగరంలో స్థిరపడిన, నివసిస్తున్న తెలుగు ప్రజలందరికీ స్వచ్ఛమైన, నాణ్యమైన మన ఊరి రుచులను, వరి వంగడాలను అందించాలనే ఉద్దేశంతోనే ఈ అవుట్‌లెట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆయన వెల్లడించారు.

రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. కేఎన్ఎం, బీపీటీ వంటి వివిధ రకాల బియ్యం వెరైటీలతో పాటు, ఎన్‌సీసీఎఫ్ ద్వారా సేకరించిన 64 రకాల నాణ్యమైన సరుకులను కూడా సబ్సిడీ రేట్లతో ఈ కౌంటర్ ద్వారా విక్రయించనున్నట్లు తెలిపారు. ప్రజలకు అందించే ఈ సేవల్లో ఎటువంటి లోపాలు తలెత్తకుండా అర్హత గల నిపుణులను నియమించి పారదర్శకంగా సేవలు అందిస్తామని మంత్రి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఏపీ భవన్ స్పెషల్ కమిషనర్ అర్జా శ్రీకాంత్, ప్రభుత్వ సలహాదారు ఏకే జైన్, ఏపీ భవన్ అధికారులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**ఎన్‌సీసీఎఫ్ ఎండీతో మంత్రి చర్చలు**

ఢిల్లీ పర్యటనలో భాగంగా నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్‌ని మంత్రి నాదెండ్ల మనోహర్ కలిశారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల సరఫరా తీరు, ధరల నియంత్రణ, వినియోగదారులకు ఇబ్బంది లేకుండా సరుకులు అందుబాటులో ఉండేలా తీసుకోవాల్సిన పటిష్ట చర్యలపై చర్చించారు. ప్రజలందరికీ నాణ్యమైన నిత్యావసర వస్తువులను సరసమైన ధరలకు అందించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.

# రాజకీయ నాయకుల్ని వెంటనే అరెస్ట్ చేయండి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 07, అనంతజనశక్తి న్యూస్**

డాక్టర్లపై రాజకీయ పార్టీ నేతలు, కార్యకర్తలు దాడులకు పాల్పడుతున్న ఘటనలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మహారాష్ట్రలో వైద్యులపై దాడులకు పాల్పడే రాజకీయ నేతలను వెంటనే అదుపులోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాంటి వ్యక్తులను స్వేచ్ఛగా తిరగనివ్వొద్దని స్పష్టం చేసింది. కళ్యాణ్‌లోని శాస్త్రినగర్ ఆసుపత్రిలో వైద్యులపై దాడి చేసిన కేసులో శివసేన కౌన్సిలర్ రమేశ్ మ్హాత్రే బెయిల్ షరతులను సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

**బెయిల్ రద్దు కోరిన మహారాష్ట్ర ప్రభుత్వం**

మ్హాత్రే తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. అయితే ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. మరోవైపు మ్హాత్రేకు మంజూరైన బెయిల్‌ను రద్దు చేయాలని మహారాష్ట్ర ప్రభుత్వం కోరినట్లు కోర్టుకు తెలిపింది. ఈ అంశంపై సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసి.. తదుపరి విచారణను సెప్టెంబర్ 28కి వాయిదా వేసింది.

**ఆసుపత్రిలో ఏం జరిగింది?**

దహీ హండి ఉత్సవాల సందర్భంగా గాయపడిన ఓ వ్యక్తిని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసే విషయంలో ఆదివారం తెల్లవారుజామున వివాదం చెలరేగింది. కళ్యాణ్‌లోని రిలీఫ్ ఆసుపత్రి కారిడార్లలో మొదలైన గొడవ క్రమంగా ఉద్రిక్తతకు దారితీసింది. ఈ ఘటనకు సంబంధించి ఫాల్ఘర్ పోలీసులు కనీసం 17 మందిపై కేసు నమోదు చేశారు. వీరిలో ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన వర్గానికి చెందిన కొందరు సభ్యులు కూడా ఉన్నారు. సీసీటీవీ ఫుటేజీలో ఓ నిందితుడు రిసెప్షనిస్ట్‌ను చెంపదెబ్బ కొట్టినట్లు కనిపించింది. ఘటనలో జోక్యం చేసుకునేందుకు ప్రయత్నించిన ఓ మహిళా ఉద్యోగిని కూడా నిందితుడు బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆసుపత్రి ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. శివసేన జిల్లా అధ్యక్షుడు కుందన్ సాంకే, నగర అధ్యక్షుడు రాహుల్ ఘరత్ సహా పలువురు ఆసుపత్రి అత్యవసర విభాగంలోకి ప్రవేశించి.. గాయపడిన వ్యక్తిని డిశ్చార్జ్ చేయడంపై వైద్యులతో వాగ్వాదానికి దిగారు. ఈ వివాదం తీవ్ర రూపం దాల్చడంతో ఆసుపత్రి సిబ్బందిపై కూడా దాడి జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

శాస్త్రినగర్ ఆసుపత్రిలో వైద్యులపై జరిగిన దాడికి సంబంధించి శివసేన కార్పొరేటర్ రమేశ్ సుక్రా మ్హాత్రేను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఆసుపత్రుల్లో వైద్య నిపుణులపై జరిగే దాడులను ఏమాత్రం తేలిగ్గా తీసుకోలేమని కోర్టు స్పష్టం చేసింది. రాజకీయ పార్టీలకు చెందిన వ్యక్తులు వైద్యులపై దాడులకు పాల్పడుతున్న ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో.. ఇలాంటి వారిని అదుపులోకి తీసుకుని, స్వేచ్ఛగా తిరగకుండా చూడాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది.

# అసెంబ్లీలో సీఎం విజయ్ విశ్వరూపం

**చెన్నై, సెప్టెంబర్ 07, అనంత జనశక్తి న్యూస్**

తమిళనాడు సీఎం విజయ్, అసెంబ్లీలో డీఎంకేపై విరుచుకుపడ్డారు. డీఎంకే అవినీతి చేసిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సోమవారం ప్రతిపక్ష డీఎంకేతో పాటు మాజీ సీఎం స్టాలిన్, ఉదయనిధి స్టాలిన్‌లను టార్గెట్ చేస్తూ ఫైర్ అయ్యారు. డీఎంకే ప్రభుత్వం హయాంలో కాంట్రాక్టర్ల నుంచి 'పార్టీ ఫండ్' పేరుతో కాంట్రాక్ట్ మొత్తంలో 7.5 శాతం నుంచి 10 శాతం వరకు లంచంగా వసూలు చేశారంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పత్రాలను ఉటంకిస్తూ ఆరోపించారు. కాంట్రాక్టర్ల నుంచి ఒకేసారి పెద్ద మొత్తంలో కాకుండా, రుణాలకు EMIలు చెల్లించినట్టుగా విడతల వారీగా వసూలు చేశారని విజయ్ ఆరోపించారు.

ముఖ్యంగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వాటర్ సప్లై శాఖ పరిధిలోని ప్రభుత్వ పనుల కాంట్రాక్టర్ల నుంచి పార్టీ ఫండ్ పేరుతో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపించారు. తాను చేస్తున్నవి వ్యక్తిగత ఆరోపణలు కాదని స్టాలిన్, ఉదయనిధి స్టాలిన్‌లు అనుమానిత ప్రత్యక్ష లబ్ధిదారులుగా ఈడీ పేర్కొన్న విషయాన్ని విజయ్ సభలో ఆరోపించారు. టాస్మాక్ వ్యవహారంలో ఈడీ ప్రస్తావించిన ''కరూర్ గ్యాంగ్'' అంశాన్ని కూడా విజయ్ లేవనెత్తారు. మాజీ ఎక్సైజ్ మంత్రి వి. సెంథిల్ బాలాజీ, ఆయన అనుచరులు కరూర్, కోయంబత్తూరు తదితర ప్రాంతాల్లోని బార్ యజమానుల నుంచి డబ్బులు వసూలు చేశారంటూ ఈడీ పత్రాలను ఉటంకిస్తూ విజయ్ ఆరోపించారు. డీఎంకే ప్రభుత్వ హయాంలో అవినీతి అక్రమాలు ఒక వ్యవస్థీకృత విధానంలో జరిగిందని, ఇది సైంటిఫిక్ కరప్షన్ అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.

దశాబ్ధాల నాటి సర్కారియ కమిషన్ నివేదికను ప్రస్తావిస్తూ వీరాణం నీటి సరఫరా పథకానికి సంబంధించిన టెండర్‌లో 2.5 శాతం పార్టీ ఫండ్ డిమాండ్ చేశారన్న ఆరోపణల్ని సీఎం విజయ్ ప్రస్తావించారు. విజయ్ ఆరోపణల నేపథ్యంలో డీఎంకే ఎమ్మెల్యేలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి నినాదాలు చేశారు. సభ నుంచి వాకౌట్ చేశారు. ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ.. విజయ్ అసలు సమస్యలపై సమాధానం ఇవ్వకుండా డైవర్షన్ కోసం పాత కేసులు, ఆరోపణల్ని ప్రస్తావిస్తున్నారని విమర్శించారు.

# మారుపేర్ల సమస్యకు శాశ్వత పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సమస్య ఇటీవల ఏర్పడింది కాదని, 1997 నుంచే సింగరేణిలో కొనసాగుతున్న పాత సమస్య అని తెలిపారు. అధికారిక రిజిస్టర్‌లో ఒకరి పేరు ఉండగా, వారి స్థానంలో మరొకరు విధులు నిర్వహించే పరిస్థితులు గతంలో ఉన్నాయని వివరించారు. చట్టప్రకారం ఒకరి పేరుతో మరొకరు ఉద్యోగం చేయడం తీవ్రమైన నేరపూరిత అంశమే అయినప్పటికీ.. కార్మికుల పరిస్థితులను అర్థం చేసుకుని గతంలో సింగరేణి యాజమాన్యం మానవీయ కోణంలో సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించిందని భట్టి పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారనే ఆరోపణలతో అప్పట్లో 45 మంది అధికారులతో పాటు సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

ప్రస్తుతం సింగరేణిలో దాదాపు 90 వేల మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, మారుపేర్ల సమస్యను ఎదుర్కొంటున్న వారి సంఖ్య కేవలం 128 మంది మాత్రమేనని భట్టి విక్రమార్క చెప్పారు. సంఖ్య పరంగా ఇది పెద్ద సమస్య కాకపోయినా, చట్టపరమైన చిక్కులు ఉండటంతో అధికారులు నిర్ణయం తీసుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.

ఒకవైపు భవిష్యత్తులో నిబంధనల ప్రకారం చర్యలు ఎదురవుతాయన్న అధికారుల ఆందోళన, మరోవైపు సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజా ప్రతినిధుల నుంచి వస్తున్న విజ్ఞప్తులను ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలించిందన్నారు. చాలా ఏళ్లుగా సింగరేణిలో పనిచేస్తున్న కార్మికుల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ఏ ఒక్క అధికారిపైనా భారం పడకుండా కమిటీ ద్వారా సమగ్రంగా పరిశీలించాలని నిర్ణయించినట్లు తెలిపారు. కమిటీ నివేదిక అందిన వెంటనే 128 మంది మారుపేర్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# స్వర్ణభారత్ ట్రస్ట్ కృషి అమోఘం

**- యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్**

**అమరావతి, సెప్టెంబర్ 07, అనంతజనశక్తి న్యూస్**

స్వర్ణభారత్ ట్రస్ట్‌పై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ ప్రశంసలు కురిపించారు. స్వర్ణభారత్ ట్రస్ట్ 25ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని వ్యాఖ్యానించారు. సమాజం కోసం ఈ ట్రస్ట్ తీసుకున్న సంకల్పం ఎంతో గొప్పదని కొనియాడారు. సోమవారం నెల్లూరులోని వెంకటాచలంలో ఘనంగా స్వర్ణభారత్ ట్రస్ట్ రజతోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మంత్రులు నారాయణ, సత్యకుమార్, ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం యోగి ఆదిత్యానాథ్ ప్రసంగించారు. 'అందరికీ ధన్యవాదాలు.. మీ స్వాగతాలకు ధన్యవాదాలు... మీ మధ్యకు రావడం చాలా ఆనందంగా ఉంది' అంటూ తెలుగులో ప్రసంగించారు.

ఈ ట్రస్ట్ ఏర్పాటుకు వెంకయ్యనాయుడు స్ఫూర్తిదాయకంగా నిలవడం అభినందనీయమని యోగి ఆదిత్యానాథ్ పేర్కొన్నారు. ఆయన దేశవ్యాప్తంగా ఎంతో పేరు గడించారని కొనియాడారు. వెంకయ్యనాయుడు అందరితో కలిసిమెలిసి కలివిడిగా ఉంటారని తెలిపారు. రాజ్యసభ అధ్యక్షుడుగా అందరినీ కలుపుకెళ్లారని అన్నారు. ఉత్తర, దక్షిణ భారత దేశాలకు సంస్కృతి వారధిగా ఆయన పనిచేశారని ప్రశంసించారు. ఇరవై ఐదేళ్ల క్రితం స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రారంభమైందని ప్రస్తావించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రయాణం అప్పుడే మొదలైందని తెలిపారు. ఇద్దరి లక్ష్యం వికసిత్ భారత్ ఇవాళ ఆవిష్కృతమైందని ఉద్ఘాటించారు. గ్రామాలు జ్ఞానానికి, మూలాలకు, ఆర్థిక అభివృద్ధికి కేంద్రాలుగా ఉన్నాయని వివరించారు. ఉత్పాదక, విక్రయాలు గ్రామాల్లోనే జరిగేవని వెల్లడించారు. గ్రామాల్లో స్వయం ప్రతిపత్తి కాస్త వెనకపడిందన్నారు. అయినా ఆ పరంపర కొనసాగుతుందని చెప్పారు. జాతిపిత మహాత్మాగాంధీ అప్పట్లో గ్రామాలకు తరలి రావాలనే పిలుపునిచ్చారని పేర్కొన్నారు.

ఆ స్కూళ్లలో నాణ్యమైన విద్యను అందిస్తున్నాం..

గ్రామీణ అభివృద్ధితో పాటు మహిళాభివృద్ధి, ఆర్థికాభివృద్ధికి స్వర్ణభారత్ ట్రస్ట్ పాటుపడుతోందని యోగి ఆదిత్యానాథ్ కొనియాడారు. చదువులకు దూరమైన పిల్లలకు చదువుతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించడం జాతి నిర్మాణానికి పాటుపడటమేనని చెప్పుకొచ్చారు. ఉత్తరప్రదేశ్‌లో పేద, నిరుపేద పిల్లలకు రెసిడెన్షియల్ స్కూళ్లలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని వివరించారు. బాషలు, ప్రాంతాలు వేరైన లక్ష్యం ఒక్కటేనని తెలిపారు. పిల్లల్లో దేశభక్తి పెరగాలని.. ఏ దేశానికి వెళ్లినా భారతీయులమని గర్వంగా చెప్పుకోవాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల ఉత్పత్తులకు ప్రపంచ వ్యాప్తంగా మార్కెటింగ్ కల్పిస్తున్నామని వివరించారు. కులవృత్తుల వారిని ప్రోత్సహిస్తున్నామని.. మహిళలకు స్వయం ప్రవృత్తి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. గో సంరక్షణ చేపట్టే వారికి నెలకు రూ.1500లను ప్రభుత్వం ద్వారా అందిస్తున్నామని స్పష్టం చేశారు. యూపీలో 25 కోట్ల మంది గ్రామీణ ప్రజలు ఉన్నారని చెప్పారు. గతంలో మరుగుదొడ్లు లేక, అనారోగ్యాలతో వేలమంది చనిపోయేవారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ తీసుకువచ్చిన స్వచ్ఛభారత్‌తో వ్యక్తిగత మరుగుదొడ్లు వచ్చాయని తెలిపారు. గ్రామాల్లో అనారోగ్య మరణాలు ఆగిపోయాయని యోగి ఆదిత్యానాథ్ పేర్కొన్నారు.

# ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి

**అమరావతి, సెప్టెంబర్ 07, అనంతజనశక్తి న్యూస్**

ఏపీలో డీఎస్సీ నిర్వహణ తీవ్ర కుంభకోణంగా మారిందని, రాష్ట్రవ్యాప్తంగా ఇది పెద్ద చర్చనీయాంశమైందని వైసీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ధ్వజమెత్తారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎస్సీలో అంతులేని అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని, దేశ చరిత్రలోనే ఇంతటి పెద్ద స్కామ్ మరొకటి జరగలేదని ఆరోపించారు. మెగా డీఎస్సీ పేరుతో టీచర్ ఉద్యోగాలను మార్కెట్‌లో అమ్మకానికి పెట్టారని, అడ్డదారిలో ఉద్యోగాలు ఎలా వచ్చాయో ఆధారాలతో సహా బయటపడుతోందని విమర్శించారు.

ఈ మొత్తం వ్యవహారానికి కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం వహించింది విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అని సజ్జల ఆరోపించారు. డీఎస్సీ అక్రమాలపై తాము నిలదీస్తే ప్రభుత్వం బుకాయిస్తూ, ఎదురుదాడికి దిగుతోందని మండిపడ్డారు. మొదట్లో ఏమీ జరగలేదని బుకాయించిన వారు, ఆ తర్వాత ఒకటి రెండు తప్పులు జరిగి ఉంటాయని ఒప్పుకునే పరిస్థితికి వచ్చారని ఎద్దేవా చేశారు. ఈ వ్యవహారంపై మాట్లాడటానికి తండ్రీకొడుకులు (చంద్రబాబు, లోకేష్) ముందడుగు వేయకుండా, మహిళా అధికారులను ముందుంచి మాట్లాడిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు సైతం వారు ముందే సిద్ధం చేసుకున్న సమాధానాలు మాత్రమే చెప్తున్నారని పేర్కొన్నారు.

ఇది సాధారణ రిక్రూట్‌మెంట్ కాదని, "క్యాష్ ఫర్ టీచర్ పోస్ట్" అని సజ్జల అభివర్ణించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేసి, అక్రమాలకు తెరలేపారని విమర్శించారు. ప్రభుత్వం తప్పులను కవరప్ చేసేందుకు రకరకాల మలుపులు తిప్పుతోందని, పొరపాట్లు ఉంటే పరిష్కరిస్తామని చెప్పడం సరికాదన్నారు. ఈ స్కామ్ చిన్నది కాదని, తప్పు చేసిన వారు కూడా చిన్నవారు కాదని స్పష్టం చేశారు. ఈ అక్రమాలకు పూర్తి బాధ్యత వహిస్తూ మంత్రి లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని, ఈ అంశంపై తమ పార్టీ పోరాటం కొనసాగుతుందని సజ్జల స్పష్టం చేశారు.

# కేసీఆర్ స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలి

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ సభ్యులను నిన్న కేసీఆర్ పిలిపించుకుని నేడు స్పీకర్ పైకి ఉసిగొల్పారు. ఇది అనాలోచితంగా జరిగిన చర్య కాదు.. పథకం ప్రకారం జరిగిందే. సభాపతికి జరిగిన అవమానం.. సభ్య సమాజానికి జరిగిన అవమానం. స్పీకర్‌పై జుగుప్సాకరమైన భాష ఉపయోగించడమేంటి? దళితులను మోసం చేసిన పార్టీ బీఆర్ఎస్. దళితుడిని సీఎం చేస్తానని, వారికి మూడెకరాల భూమి ఇస్తామని చెప్పి కేసీఆర్ మోసం చేశారు. బీఆర్ఎస్‌ది దళిత వ్యతిరేక ఆలోచన.

**కేసీఆర్ క్షమాపణ చెప్పాలి**

సభాపతికి జరిగిన అవమానం.. మా అందరికీ జరిగినట్లు భావిస్తున్నాం. దీన్ని అందరూ ముక్తకంఠంతో ఖండించాలి. స్పీకర్‌కు జరిగిన అవమానం సభకు జరిగినట్లుగానే భావించాలి. బీఆర్ఎస్ నేతల అపవాదును భాజపా నేతలు ఎందుకు మోస్తున్నారు? ఈ అంశంపై చర్చకు భాజపా సభ్యులు సహకరించాలి. దీనిపై చర్చ తర్వాతే ఏ అంశంపైనైనా చర్చిద్దాం. స్వతంత్ర భారతంలో ఇలాంటి అవమానం గతంలో ఎప్పుడూ జరగలేదు. ఇలాంటి భాష వాడిన తాతా మధును డిస్మిస్ చేయాలి. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ క్షమాపణ చెప్పాలి. అసభ్యకర భాష వాడిన తాతా మధుతో రాజీనామా చేయించాలి. ఇలాంటి వాటికి క్షమిస్తే చట్టసభలకు గౌరవం, మర్యాద ఉండదు'' అని రేవంత్ అన్నారు.

కమ్యూనిస్టుల పోరాటం.. కాంగ్రెస్ పరిష్కారం.!

రవీంద్రభారతిలో జరిగిన కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కమ్యూనిస్టుల పోరాటాలపై తనకు అభిమానం ఉందని తెలిపారు. రైతు, కూలీల కోసం కమ్యూనిస్టులు పోరాటం చేశారని, ఆ సమస్యలకు పరిష్కారం చూపింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. ఇంకా.. దున్నే వాడికి భూమి ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనేనని సీఎం పేర్కొన్నారు. అసైన్డ్ భూములకు పట్టాలు ఇచ్చిన ఘనత కూడా కాంగ్రెస్‌కే దక్కుతుందని అన్నారు. "పోరాటం కమ్యూనిస్టులది.. పరిష్కారం కాంగ్రెస్ పార్టీది" అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

మరోవైపు బీజేపీపై విమర్శలు చేస్తూ.. ప్రజలతో గెలవలేనప్పుడు సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను ఉపయోగించిందని ఆరోపించారు. ఇప్పుడు ఎస్ఐఆర్‌ను ఉపయోగిస్తున్నారని విమర్శించారు. తమకు వ్యతిరేకంగా ఉన్న ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మైనార్టీల ఓట్లే కాకుండా బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న ఎస్సీ, ఎస్టీల ఓట్లను కూడా తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఓట్ల తొలగింపును అడ్డుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ప్రతిపక్షాలు ఇప్పటివరకు ఈ అంశంపై మాట్లాడటం లేదని అన్నారు.

**2029 ఎన్నికల్లో మోదీ ఓటమికి ఇవే తొలి అడుగులు అని సీఎం వ్యాఖ్యానించారు. ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో అని ఆలోచించవద్దని.. 2026లోనే ఎవరు గెలవాలి.? ఎవరు ఓడిపోవాలి.? అనే విషయాన్ని బీజేపీ నిర్ణయించే పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. ఎన్నికల సంఘం నిర్ణయించాల్సిన అంశాల్లో కూడా జోక్యం చేసుకునే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. వందేళ్ల కమ్యూనిస్టు చరిత్రను తిరగేస్తే ఎర్రజెండా అంటే ప్రజలకు నమ్మకం, పేదలకు భరోసా అని రేవంత్ రెడ్డి అన్నారు. మిగిలిన జెండాలను ప్రజలు పాలకుల జెండాలుగా భావిస్తారని, ఎర్రజెండా కనిపిస్తే మాత్రం భరోసా కలుగుతుందని పేర్కొన్నారు.**

**కమ్యూనిస్టులు ఎన్నికల్లో గెలుస్తారా? ఓడిపోతారా? అనే లెక్కలు వేసుకోవాల్సిన అవసరం లేదని సీఎం అన్నారు. ప్రజల ఓట్లను కాపాడుకోవడంపై దృష్టి పెట్టాలని సూచించారు. కమ్యూనిస్టులు లేవనెత్తే సమస్యలకు సహేతుకమైన పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పాలమూరు ప్రాంతానికి చెందిన వ్యక్తి అని ప్రస్తావించిన సీఎం.. సమస్యను లేవనెత్తేవారు పాలమూరు వారేనని, పరిష్కారం చేసేవారు కూడా పాలమూరు వారేనని అన్నారు. సారంపల్లి మల్లారెడ్డి పేరుకు తగిన గౌరవం దక్కేలా ఏదో ఒక ప్రాంతానికి ఆయన పేరు పెట్టే అంశంపై మంత్రివర్గంలో చర్చిస్తానని రేవంత్ రెడ్డి తెలిపారు.**

### గాల్లో ఉండగా.. విమానం ఇంజిన్‌లో

# తగ్గిపోయిన ఆయిల్

ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన ఓ విమానం గాల్లో ఉండగా ఇంజిన్‌లో సమస్య తలెత్తింది. దీంతో ఆ విమానాన్ని వెనక్కి మళ్లించి అత్యవసర ల్యాండ్ చేశారు. ఈ విమానం సోమవారం ఉదయం కేరళ లోని కొచ్చి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అబుధాబికి బయల్దేరింది. టేకాఫ్ అయిన సుమారు 50 నిమిషాల తర్వాత.. మొదటి ఇంజిన్‌లో ఆయిల్ తగ్గడాన్ని పైలట్లు గుర్తించారు. ఆయిల్ ప్రెజర్ ప్రమాదకర స్థాయికి చేరడంతో వెంటనే ఆ ఇంజిన్‌ను ఆపి వేశారు. మిగిలిన ఒకే ఇంజిన్‌తో ప్రయాణం కొనసాగించడం కష్టం కావడంతో విమానాన్ని వెంటే వెనక్కి మళ్లించారు. ఒకే ఇంజిన్‌తో 45నిమిషాల పాటు ప్రయాణించిన ఆ విమానం పైలట్ల అప్రమత్తతో సురక్షితంగా కొచ్చివిమానాశ్రయంలో దిగింది. దీనిపై విమానయాన సంస్థ స్పందించింది. ఘటనకు దారి తీసిన పరిస్థితులపై అంతర్గత విచారణ కొనసాగుతోందని తెలిపింది. ప్రయాణికుల భద్రతే తమకు ముఖ్యమని వెల్లడించింది. మరోవైపు ఈ ఘటనపై అధికారిక దర్యాప్తు చేపట్టాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ సంబంధిత అధికారులను ఆదేశించింది.

అమృత్‌సర్ ఎయిర్‌పోర్టు వద్ద డ్రోన్‌ల కలకలం..

అమృత్‌సర్ ఎయిర్‌పోర్టు వద్ద అనుమానాస్పద డ్రోన్‌లు కలకలం సృష్టించాయి. ఈ విమానాశ్రయం భారత్ పాక్ సరిహద్దులకు సమీపంలో ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ముందు జాగ్రత్త చర్యగా ఏడు విమానాలను దారి మళ్లించామని.. కొన్నిగంటలపాటు ఎయిర్‌పోర్టులో కార్యకలాపాలను నిలిపివేశామని వెల్లడించారు. విమానాశ్రయ ప్రహరి గోడ వెలుపల పలు డ్రోన్లు అనుమానాస్పదంగా ఎగురుతూ కనిపించినట్లు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వెల్లడించింది.




# ప్రైవేటీకరణ జరగదు.. ప్రాధాన్యం తగ్గదు




భారత అంతరిక్ష పరిశోధన సంస్థను (ఇస్రో) ప్రైవేటీకరించబోతున్నారంటూ వస్తున్న వార్తలను ఆ సంస్థ ఖండించింది. ప్రైవేటీకరణ ఏమీ జరగబోదని, సంస్థ ప్రాధాన్యం కూడా తగ్గబోదని స్పష్టం చేసింది. ప్రైవేటు రంగ భాగస్వామ్యంవల్ల తాము తర్వాతి తరం అంతరిక్ష కార్యక్రమాలపై బలంగా దృష్టి పెట్టే వెసులుబాటు దక్కుతుందని పేర్కొంది. ఇస్రోను ప్రైవేటీకరిస్తారన్న వార్తలపై ఆందోళన వ్యక్తం చేస్తూ.. వాటిపై వివరణ ఇవ్వాలని ఆ సంస్థకు చెందిన 9 ఉద్యోగ సంఘాలు ఈ నెల 4న ఓ లేఖలో కోరాయి. ఈ నేపథ్యంలో ఇస్రో 'ఎక్స్'లో ఆదివారం సవివర పోస్టు పెట్టింది. ''పరిశోధనఅభివృద్ధి, అత్యాధునిక సాంకేతికతలు, మానవ సహిత అంతరిక్ష యాత్రలు, తర్వాతి తరం లాంఛ్ వ్యవస్థలు, డీప్ స్పేస్, గ్రహాంతర మిషన్ల వంటి అత్యంత కీలక అంశాల్లో ఇస్రో పాత్ర బలోపేతమవుతుంది. కమ్యూనికేషన్, నేవిగేషన్, భూ పరిశీలన కోసం అడ్వాన్స్‌డ్ పేలోడ్లు, సెన్సర్ల వంటివి అభివృద్ధి చేస్తూనే ఉంటాం. అదే సమయంలో.. మెచ్యూర్ లాంఛ్ వెహికిల్స్, రొటీన్ ఉపగ్రహాలవంటి వాటిని ప్రైవేటు పరిశ్రమలు, పీఎస్‌యూలు ఉత్పత్తి చేస్తాయి. దీనివల్ల మేం ఎక్కువ వనరులను తర్వాతి తరం సాంకేతికతలు, మిషన్ల కోసం కేటాయించగలుగుతాం'' అని ఇస్రో పేర్కొంది.


భారత అంతరిక్ష రంగానికి ఇస్రో గట్టి పునాదిలా కొనసాగుతుందని ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ ఛైర్‌పర్సన్ పవన్ గోయెంకా స్పష్టం చేశారు.

## భూమి పుట్టినప్పటి నుంచే బస్తర్

**ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో జరిగిన ఒక సరికొత్త ఆవిష్కరణ శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షిస్తోంది. ఆ ప్రాంతంలో సుమారు 3.65 బిలియన్ ఏళ్లనాటి ఖనిజ కణాల ఆనవాళ్లు గుర్తించారు. భూమి వయసు సుమారు 4.54 బిలియన్ సంవత్సరాలు. భారత్‌లో పురాతన భూభాగాల ప్రస్తావన వచ్చినప్పుడల్లా 3.5 బిలియన్ సంవత్సరాల నాటిదని భావించే ఝార్ఖండ్‌లోని సింహభూమ్ క్రేటన్ ప్రాంతమే మొదటగా గుర్తుకు వచ్చేది. ఇప్పుడు బస్తర్‌లో అంతకంటే పురాతనమైన శిలలను కనుగొన్నారు. ఈ శిలలను ఇంత పురాతనమైనవనిగా గుర్తించడానికి జిర్కాన్ అనే ఖనిజం కీలకంగా మారిందని భోపాల్ ఐఐఎస్ఈఆర్ శాస్త్రవేత్త ప్రీతమ్ నాసిపురి తెలిపారు. నైరుతి బస్తర్‌లోని భోపాల్‌పట్నం, బీజాపూర్ పరిసరాల నుంచి ఈ శిలా నమూనాలను శాస్త్రవేత్తలు సేకరించారు.**



## 18 అడుగుల బాహుబలి మంచం



**హరియాణాలోని హాంసీ జిల్లా ధనాఖుర్ద్ గ్రామానికి చెందిన భోలే భండారీ 18 అడుగుల పొడవు, 9 అడుగుల వెడల్పుతో బాహుబలి మంచాన్ని రూపొందించారు. 900 కిలోల బరువున్న ఈ మంచం తయారీకి 60 కిలోల ఇత్తడిని వాడారు. నాలుగు నెలల శ్రమతో సుమారు రూ.4.25 లక్షల ఖర్చయింది. మంచం కాళ్లను అశోక స్తంభం ఆకృతిని పోలి ఉండేలా తీర్చిదిద్దారు. ఈ మంచాన్ని అల్లడానికి గుజరాత్‌లోని మహువా నుంచి తెచ్చిన 22 రకాల రంగులతో కూడిన సుమారు 200 కిలోల పట్టుతాళ్లను వాడారు. దీనిని సోంధీ గ్రామంలోని గులియా ఖాప్ చౌపాల్‌కు (సామాజిక సమావేశ స్థలికి) తరలించనున్నారు. ఉత్తరాదిలో గ్రామ సమావేశాలకు ఇటువంటి మంచాలను వాడతారు.**

## జాతీయ సఫాయి కర్మచారీ కమిషన్ ఛైర్మన్‌గా భగవత్ ప్రసాద్ మక్వానా

కేంద్ర ప్రభుత్వం జాతీయ సఫాయి కర్మచారీ కమిషన్‌కు ఛైర్మన్, వైస్ ఛైర్మన్, సభ్యులను నియమించింది. ఛైర్మన్‌గా ఉత్తరాఖండ్‌కు చెందిన భగవత్ ప్రసాద్ మక్వానా, వైస్ ఛైర్మన్‌గా ఒడిశా వాసి కైషబ్ బిహారి, సభ్యులుగా ఉత్తర్ ప్రదేశ్ వాసులైన మనోజ్ కుమార్ బాల్మీకి, సుష్మా గౌడియాల్, మహారాష్ట్రకు చెందిన రవి రాము కలోసే నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారతశాఖ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఛైర్మన్‌గా నియమితులైన భగవత్ ప్రసాద్ మక్వానా ఇదివరకు ఉత్తరాఖండ్ సఫాయి కర్మచారీ కమిషన్ ఛైర్మన్‌గా పనిచేశారు. వీరి పదవీకాలం 2028 మార్చి 31 వరకు ఉంటుంది. 1994లో పార్లమెంటు చేసిన చట్టం ద్వారా ఏర్పడిన ఈ కమిషన్ ప్రధాన బాధ్యత పారిశుద్ధ్య కార్మికుల పని పరిస్థితులను మెరుగుపరిచి వారి జీవనప్రమాణాలను మెరుగుపరచడమే.



## 300 కిలోమీటర్ల దూరంలోని గగనతల లక్ష్యాలను కూల్చేలా..!

సరిహద్దుల్లో పొంచి ఉన్న ఎటువంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు భారత వైమానిక దళం తన సామర్థ్యాన్ని మరింత పెంచుకుంటోంది. ఇందులో భాగంగా సుఖోయ్ 30ఎంకేఐ యుద్ధ విమానాల ఆధునికీకరణపై దృష్టిపెట్టింది. శత్రువుల గగనతల లక్ష్యాలను 300 కిలోమీటర్ల సుదూర పరిధి నుంచే ఛేదించగల.. రష్యాకు చెందిన ఆర్‌వీవీ బీడీ ఎయిర్‌టుఎయిర్ క్షిపణులను వీటికి అనుసంధానించడానికి చర్యలు తీసుకుంటోంది. త్వరలో దిల్లీలో జరగనున్న బ్రిక్స్ సమావేశానికి రష్యా అధ్యక్షుడు పుతిన్ హాజరుకానున్నట్లు తెలుస్తోంది. ఆ సందర్భంగా జరిగే ద్వైపాక్షిక సమావేశాల్లో ఈ క్షిపణుల అంశాన్ని చర్చించే అవకాశాలున్నాయి.

ఆర్‌వీవీ బీడీ క్షిపణులను అమర్చేందుకు.. సుఖోయ్ 30 ఎంకేఐ విమానాలలో మార్పులు చేసే ప్రతిపాదనపై సోమవారం రక్షణ సేకరణ మండలి సమావేశంలో చర్చించనున్నారు. అనంతరం ఈ క్షిపణుల కొనుగోలుకు ఒప్పందం దిశగా ప్రయత్నాలు జరగనున్నాయి. అదే విధంగా ఫ్రాన్స్ నుంచి మిటియార్ గగనతల క్షిపణులను కొనుగోలు చేయడానికి కూడా భారత్ భారీ ఆర్డర్లు ఇచ్చినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం భారత్ వద్ద 260కి పైగా సుఖోయ్ 30 ఎంకేఐ విమానాలు ఉన్నాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఇవి కీలక పాత్ర పోషించాయి.



## అన్నదమ్ములను కలిపిన 'సర్'

ఓటర్ల జాబితాల్లో సవరణల కోసం ప్రభుత్వం చేపట్టిన 'సర్' ప్రక్రియ హరియాణాలో 35ఏళ్ల ఎడబాటు తర్వాత ఇద్దరు సోదరులను కలిపింది. పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో నివాసముంటున్న సీతారాం (55) 'సర్' పరిశీలన నిమిత్తం ధ్రువపత్రం కావాలని తాను చదువుకున్న జీంద్ జిల్లా మనోహర్‌పుర్ ప్రభుత్వ పాఠశాలకు వచ్చారు. తన సోదరుడి పేరు దల్బీర్ సింగ్ (60) అని చెప్పారు. దల్బీర్‌తో పరిచయం ఉన్న బూత్ లెవెల్ అధికారి (బీఎల్వో) కిషన్ కుమార్ వెంటనే ఆయనకు ఫోన్ చేశారు. తమ్ముడు సీతారాం ఆచూకీ గురించి వినగానే దల్బీర్ స్కూలుకు చేరుకున్నారు. 35 ఏళ్ల తర్వాత అన్నదమ్ములు ఇద్దరూ ఒకరినొకరు చూసుకోగానే హత్తుకుని కన్నీటి పర్యంతమయ్యారు.



## లంచాలను ఈఎంఐల్లాగా ఇవ్వాల్సి వచ్చింది:



**- డీఎంకేపై విజయ్ తీవ్ర విమర్శలు**

తమిళనాడు అసెంబ్లీ వేదికగా ప్రతిపక్షపార్టీ డీఎంకేపై సీఎం విజయ్ విరుచుకుపడ్డారు. బ్యాంకు రుణాలకు ఈఎంఐలు కట్టినట్టుగా వాయిదాల పద్ధతిలో ప్రభుత్వ కాంట్రాక్టర్లు ఆ ప్రభుత్వానికి లంచాలు ఇచ్చుకోవాల్సి వచ్చిందని విమర్శలు గుప్పించారు. దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పొందుపర్చిన వివరాల ఆధారంగా తాను ఈ విమర్శలు చేస్తున్నట్లు చెప్పారు. కాంట్రాక్ట్ విలువలో ఆ మొత్తం 10 శాతం వరకు ఉండేదన్నారు.

''పార్టీ నిధుల కోసమని చెప్పి, 7.5 శాతం నుంచి 10 శాతం వరకు వసూలు చేశారని ఈడీ పత్రాల ద్వారా వెల్లడవుతోంది. అధికారంలో ఉన్న పార్టీ కోసం ఈ లంచాలు తీసుకున్నారు. అప్పుడు అధికారంలో ఉన్నది డీఎంకేనే కదా..! ఎంకే స్టాలిన్, ఉదయనిధి స్టాలిన్ తదితర కీలక నేతలు వసూళ్ల సొమ్ముకు ప్రత్యక్ష లబ్ధిదారులు'' అని విజయ్ విమర్శించారు.

## ప్రకూలిన ఐదంతస్తుల భవనం.. యజమానికి లుకౌట్ నోటీసులు



దేశ రాజధాని దిల్లీలో ఐదంతస్తుల భవనం కూలిన ఘటనలో దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ భవన యజమాని హరిరామ్‌పై పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. అతడి కోసం గాలింపు చేపట్టారు. దిల్లీ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణానికి సమీపంలో సత్యనికేతన్ వద్ద ఆదివారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ప్రమాదంలో ఇప్పటి వరకు ఏడుగురు మృతిచెందగా.. శిథిలాల కింద చిక్కుకున్న పలువురిని సహాయక సిబ్బంది వెలికి తీశారు. ఇప్పటి వరకు 12 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు.

ఘటనాస్థలాన్ని దిల్లీ సీఎం రేఖా గుప్తా సోమవారం ఉదయం పరిశీలించారు. బాధ్యులపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. బేస్‌మెంట్‌లో నీరు చేరడం, మరమ్మతుల కోసం చేపట్టిన పనుల వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు ప్రాథమికంగా నిర్ధరించారు.

## మూడేళ్లలో మూడో విద్యా మంత్రి మరణం



ఝార్ఖండ్‌లో హేమంత్ సోరెన్ సర్కారుకు మరో విషాదాంతం ఎదురైంది. ఉన్నత, సాంకేతిక విద్యాశాఖల మంత్రి సుదివ్య కుమార్ (56) ఆదివారం గుండెపోటుతో మరణించారు. గిరిడీహ్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో తెల్లవారుజామున 2.30కి ఆయన్ని చేర్పించగా కాసేపట్లో కన్నుమూశారు. విద్యాశాఖతో ముడిపడిన మంత్రుల్లో 2023 నుంచి ఇలా మృతి చెందిన సందర్భం ఇది మూడోది. 2019లో తొలిసారి సోరెన్ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి మొత్తంగా నలుగురు క్యాబినెట్ సహచరుల్ని కోల్పోయారు. గతంలో విద్యాశాఖను చూసిన జగర్‌నాథ్ మహతో 2023లో, రాందాస్ సోరెన్ 2025లో తీవ్ర అనారోగ్యంతో కన్నుమూశారు. సుదివ్య కుమార్ సీఎంకు అత్యంత సన్నిహితుడైన మంత్రి. ఎన్నికల వ్యూహకర్తగా, రాజకీయ సంక్షోభాల పరిష్కర్తగా వ్యవహరించేవారు.

## విమానాశ్రయంలో బంగారం, 484 వెండి నాణేలు స్వాధీనం

దిల్లీ: దేశ రాజధాని నగరంలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ.47.16 లక్షల విలువైన ఓ బంగారు నాణెం, 484 వెండి నాణేలను స్వాధీనం చేసుకున్నట్లు కస్టమ్స్ అధికారులు ఆదివారం వెల్లడించారు. దోహా నుంచి వచ్చిన ఇద్దరు ప్రయాణికుల తనిఖీలో స్వాధీనం చేసుకున్న వీటిలో పురావస్తు ప్రాధాన్యంగల వెండి నాణేలు 134దాకా ఉన్నట్లు తెలిపారు.

## కేరళంలో రూ.57 కోట్ల దేవస్థాన రుణ పరిష్కారంలో గల్ఫ్ వ్యాపారి వితరణ

**త్రిశ్శూర్: కేరళంలో ఏటా నిర్వహించే ప్రఖ్యాత త్రిశ్శూర్ పూరం ఆధ్యాత్మిక వేడుకలో కీలక భాగస్వామి అయిన తిరువంబాడి దేవస్థానానికి సంబంధించిన రూ.57 కోట్ల బ్యాంకు రుణ పరిష్కారంలో సహకరించినందుకుగానూ గల్ఫ్ ఆధారిత వ్యాపారవేత్త పి.ఎన్.సి.మీనన్‌కు రాష్ట్ర భాజపా అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. శోభా గ్రూపు వ్యవస్థాపకుడైన మీనన్ ఈ వ్యవహారంలో వన్‌టైం సెటిల్‌మెంటు కింద రూ.21 కోట్లు చెల్లించి సమస్యను పరిష్కరించినట్లుగా రాజీవ్ చంద్రశేఖర్ ఆదివారం 'ఎక్స్'ద్వారా తెలిపారు.**



# చైనా ఉత్పత్తులే శరణ్యమా?

చైనీస్ ఉత్పత్తులను బహిష్కరించాలనే పిలుపులు భారత్‌తో పాటు ఐరోపా, అమెరికా, వియత్నాం, ఫిలిప్పీన్స్ వంటి దేశాల్లోనూ ఊపందుకున్నాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తలెత్తి... ప్రజల్లో ఆందోళన, అభద్రతా భావనలు రేగినపుడల్లా బీజింగ్ ఉత్పత్తులను బహిష్కరించాలనే వాదనలు తీవ్రమవుతుంటాయి. అయినాసరే, ఈ ఉద్యమాలేవీ ఆశించిన ఆర్థిక లక్ష్యాలను సాధించడం లేదు. అందుకు కారణం- సరసమైన ధరలకు లభించే చైనా ఉత్పత్తులు ప్రపంచ సరఫరా గొలుసులలో పూర్తిగా అంతర్భాగం కావడమే!

అనేక దేశాల్లో చైనా వ్యతిరేక భావనలు ప్రబలంగా ఉన్నప్పటికీ, బీజింగ్ తన ఆర్థిక స్థానాన్ని ఏడాదికేడాది బలపరచుకుంటూనే ఉంది. వాణిజ్యపరమైన భావోద్వేగాలు, రాజకీయ వైరుధ్యాలకన్నా ఆర్థిక అంశాలే ప్రాధాన్యం వహిస్తాయని ఇక్కడ రూఢి అవుతోంది. ఉత్పత్తులు నాసిరకంగా ఉంటాయనే వాదనతో వాణిజ్య బహిష్కరణలకు, వ్యతిరేక భావనలకు గురవుతున్న ఏకైక దేశం చైనాయే. డ్రాగన్‌తో అత్యధికంగా వాణిజ్యం జరిపే దేశాలే తరచూ చైనా వస్తు బహిష్కరణకు పిలుపివ్వడం, ఆర్థిక ఆంక్షలు విధించడం, విపరీతంగా సుంకాలు విధించడం గమనార్హం. బీజింగ్ వస్తు బహిష్కరణకు వినియోగదారుల ఉద్యమాలూ జరుగుతున్నాయి. ఇలాంటి పిలుపులు 2010 దశకంలోనూ, కొవిడ్-19 తరవాత మరింత ఊపందుకున్నాయి.

**గరిష్ఠ స్థాయికి వాణిజ్య లోటు...**

చైనాలో మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయని ఐరోపా విమర్శలు గుప్పిస్తూ వచ్చింది. డ్రాగన్ తయారీ స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ పరికరాలు జాతీయ భద్రతకు ముప్పు తెచ్చిపెడతాయనే ఆందోళనలు అక్కడ వ్యక్తమవుతున్నాయి. అందుకే చైనీస్ వస్తువులపై అధికంగా ఆధారపడటాన్ని తగ్గించాలని ఐరోపా దేశాల విధానకర్తలు, పారిశ్రామిక వర్గాలపై ఒత్తిడి పెరుగుతోంది. అమెరికా సైతం చైనా నుంచి వస్తు దిగుమతులను తగ్గించుకోవడానికి అనేక పద్ధతులను వినియోగిస్తోంది. ముఖ్యంగా దేశీయ వస్తూత్పత్తిని పెంచడానికి ప్రోత్సాహకాలిస్తోంది. సరఫరా గొలుసుల వైవిధ్యీకరణ, ప్రభుత్వ కొనుగోళ్లలో స్వదేశీ వస్తువులకు ప్రాధాన్యమివ్వడం, చైనా ఎగుమతులపై అత్యధిక సుంకాలు, వాణిజ్య ఆంక్షలు విధించడం వంటి వ్యూహాన్ని చేపట్టింది.

విస్తీర్ణ పరంగా చైనా ప్రపంచంలోనే మూడో అతిపెద్ద దేశం, అత్యధిక జనాభా కలిగిన రెండో దేశం. సహజ వనరులకూ లోటులేదక్కడ. చైనా వీటన్నింటినీ సద్వినియోగం చేసుకోవడం ద్వారా జీడీపీ పరంగా ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. దీర్ఘకాలిక విధానాలు, భారీ పెట్టుబడులు, ప్రపంచ వాణిజ్యంతో అనుసంధానం కావడం వంటి చర్యలతో ప్రపంచ ఆర్థిక శక్తిగా స్థిరపడింది. చైనా 14 పొరుగు దేశాలతో భూసరిహద్దులను పంచుకుంటోంది. వాటిలో కొన్ని భాగాలు వివాదాస్పదంగా ఉన్నాయి. అందుకే భారత్, వియత్నాం సహా మరికొన్ని పొరుగు దేశాలతో డ్రాగన్‌కు ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఫిలిప్పీన్స్, వియత్నాం, మలేసియా, బ్రూనై, తైవాన్, జపాన్ వంటి దేశాలతో చైనాకు తీవ్రమైన సముద్ర వివాదాలున్నాయి. ఇవే పొరుగు దేశాల్లో చైనా వస్తు బహిష్కరణ ఉద్యమాలకు ఊపునిస్తున్నాయి. 1962 యుద్ధ సమయంలోనే భారత్‌లో చైనీస్ వస్తు బహిష్కరణకు బీజం పడింది. 2020 జూన్‌లో గల్వాన్ ఘర్షణలు భారతీయుల్లో చైనా వ్యతిరేకతను మరింత పెంచాయి.

చైనా నుంచి దిగుమతులు చేసుకోవాల్సిన అగత్యాన్ని తప్పించడానికీ, స్వదేశీ వస్తువులకు ఆదరణ పెంచడానికీ 'మేకిన్ ఇండియా, వోకల్ ఫర్ లోకల్' వంటి కార్యక్రమాలను రూపొందించారు. అయినాసరే, చైనా ఇప్పటికీ భారతదేశ అతిపెద్ద వాణిజ్య భాగస్వాములలో ఒకటిగా కొనసాగుతోంది. పారిశ్రామిక విడిభాగాలు, ముడిసరకుల కోసం డ్రాగన్‌పై ఆధారపడుతూనే ఉండటం వల్ల మొన్న జూన్ నాటికి చైనాతో భారత వాణిజ్య లోటు మునుపెన్నడూ లేనంతగా 11,216 కోట్ల డాలర్ల గరిష్ఠ స్థాయికి చేరింది. ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో ప్రపంచవ్యాప్తంగా చైనా ఎగుమతులు 17.6శాతం పెరిగి, రికార్డు స్థాయిలో 2.12లక్షల కోట్ల డాలర్లకు చేరాయి.

**అతిగా ఆధారపడుతున్నాం**

భారతదేశంలో చైనా స్మార్ట్‌ఫోన్లు, గేమ్ యాప్‌లకు విపరీతమైన ఆదరణ ఉంది. దీనివల్ల చైనాతో భారత్‌కు వాణిజ్య లోటు పెరగడంతో పాటు మన డేటా గోప్యతకూ, జాతీయ భద్రతకూ ముప్పు వాటిల్లే ప్రమాదముంది. దశాబ్ద కాలంగా భారత్‌కు చైనా నుంచి దిగుమతులు అధికమవుతున్నాయి. 2014లో 5,420 కోట్ల డాలర్లుగా ఉన్న ఆ దిగుమతులు 2019లో 7,480 కోట్ల డాలర్లకు, 2024 నాటికి 12వేల కోట్ల డాలర్లకు పెరిగాయి. ఈ ఏడాదిలో అవి 14వేల కోట్ల డాలర్లకు చేరుకుంటాయని అంచనా. చింతించాల్సిన విషయమేమంటే, ఇదే కాలంలో చైనాకు భారతీయ ఎగుమతులు పెద్దగా పెరగకపోవడం! 2014లో చైనాకు ఇండియా ఎగుమతులు 1,340 కోట్ల డాలర్లు కాగా, 2024 నాటికి అవి 2,810 కోట్ల డాలర్లకు పెరిగి, 2026 నాటికి 1,948 కోట్ల డాలర్లకు తగ్గిపోయాయి. దీని అర్థం- చైనాపై ఇండియా అతిగా ఆధారపడుతోందీ, చైనీస్ మార్కెట్‌కు తన ఎగుమతులను పెంచుకోవడానికి తీవ్రంగా కష్టపడుతోందీ అని!

దీన్ని సరిదిద్దడం భారతదేశ దీర్ఘకాలిక వ్యూహం కావాలి. ఇతర దేశాల సరఫరా గొలుసులను ఉపయోగించుకోవడం, దేశీయ తయారీని, ఎగుమతి పోటీతత్వాన్నీ మెరుగుపరచడం ద్వారా భారత్ స్వావలంబన దిశగా పరుగులు తీయాలి. మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్, ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం వంటి ముఖ్యమైన కార్యక్రమాలు రక్షణ, పునరుత్పాదక ఇంధన వనరులు, ఫార్మాస్యూటికల్స్ వంటి ప్రాధాన్య రంగాల్లో కొన్ని ప్రయోజనాలను అందించాయి. ఈ రంగాల్లో దేశీయ సామర్థ్యం గణనీయంగా విస్తరించి, దిగుమతులపై ఆధారపడటం తగ్గింది. కానీ ముడి చమురు, సెమీకండక్టర్ భాగాలు, అధునాతన పారిశ్రామిక సాంకేతికత, తయారీ పరికరాల దిగుమతులపై ఇప్పటికీ ఆధారపడక తప్పడం లేదు. దాంతో అన్ని రంగాల్లో స్వయంసమృద్ధి సాధించాలనే లక్ష్యానికి భారత్ ఇంకా చాలా దూరంగానే ఉండిపోవాల్సి వస్తోంది.



# పరిశీలనకు నిలిచిన వృద్ధి గణాంకాలు

**చమురు సవాళ్లున్న ఒక త్రైమాసికంలో భారతదేశం ఎలా 7.8 శాతం వృద్ధి చెందగలదని అభిషేక్ ఆనంద్, జోష్ ఫెల్మాన్ మరియు అరవింద్ సుబ్రమణ్యన్ ప్రశ్నిస్తున్నారు. ఇది సమంజసమైన ప్రశ్నే. దీనికి సమాధానం కూడా ఉంది, ఆ సమాధానం గత కొన్నేళ్లుగా స్పష్టంగా కనిపిస్తూనే ఉంది.ముందుగా సమయం గురించి మాట్లాడదాం. ఆ త్రైమాసికం ఏప్రిల్ నుండి జూన్ 2026 వరకు నడుస్తుంది. ఇరాన్, యునైటెడ్ స్టేట్స్ మరియు ఇజ్రాయెల్ మధ్య ఘర్షణలు దీనికి ముందే తీవ్రరూపం దాల్చాయి. చమురు ధరలు పెరిగాయి, ఆ ప్రభావాన్ని భారత్ కూడా అనుభవించింది. అయితే, అత్యంత తీవ్రమైన విఘాతం మార్చి మరియు ఏప్రిల్ ప్రారంభ రోజులలో సంభవించింది. మే నాటికి ఒత్తిడి తగ్గింది. జూన్ నాటికి అది దాదాపుగా తొలగిపోయింది. మూడు నెలల త్రైమాసికం ప్రారంభంలో కొన్ని కష్టమైన వారాలు ఉన్నంత మాత్రాన, ఆ త్రైమాసికపు గణాంకాలు కల్పన అయిపోవు.ఆ నెలల నాటి ఆధారాలన్నీ ఒకే వైపు చూపుతున్నాయి. వాహనాల విక్రయాలు క్రమంగా పెరిగాయి. బ్యాంక్ రుణాలు విస్తరించాయి. పోటీతత్వ మద్దతుతో ఎగుమతులు పెరిగాయి. పన్ను రేట్ల కోత తర్వాత కూడా జీఎస్టీ వసూళ్లు బలంగానే ఉన్నాయి. గత ఏడాదిలో 8.3 శాతం పెరిగాయి. 2025-26 నాటికి ఉన్న మూడు సంవత్సరాలలో, స్థూల జీఎస్టీ వసూళ్లు 32 శాతం పెరగ్గా, నామినల్ జీడీపీ 31.9 శాతం పెరిగింది. ఈ రెండు గణాంకాలు పూర్తిగా వేర్వేరు మూలాల నుండి వచ్చినవి, అయినప్పటికీ అవి దాదాపు ఒకేలా సరిపోలుతున్నాయి. జీఎస్టీ రిటర్న్‌లను కంపెనీలు దాఖలు చేస్తాయి. రుణాల డేటా బ్యాంకుల నుంచి వస్తుంది. వాణిజ్య డేటా పోర్ట్‌ల నుంచి వస్తుంది. ఈ గణాంకాల్లో దేనినీ గణాంకాలు మంత్రిత్వ శాఖ స్వయంగా రూపొందించదు.**

ఆర్థిక వ్యవస్థ ఎందుకు నిలదొక్కుకుంది? ఎందుకంటే అనేక సంస్కరణలు ఒకే సమయంలో పరిపక్వత సాధించాయి. కేంద్ర ప్రభుత్వ మూలధన వ్యయం 202223 నుంచి 65 శాతం పెరిగింది. ఈ ఏడాది మరో 11.5 శాతం పెరుగుతుందని బడ్జెట్‌లో అంచనా వేశారు. దశాబ్ద కాలంగా నిర్మించిన రహదారులు, రేవులు, విద్యుత్ సామర్థ్యం, చమురు ధరలు పెరిగినంత మాత్రాన పనిచేయడాన్ని ఆపవు. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసంఘటిత కార్యకలాపాలను కొలిచేందుకు వీలైన సంఘటిత ఆర్థిక వ్యవస్థలోకి తీసుకువచ్చింది. ఇన్సాల్వెన్సీ కోడ్ బ్యాంకులు, సంస్థల మొండి బకాయిలను నిర్వహించే విధానాన్ని మార్చివేసింది. రియల్ ఎస్టేట్ చట్టం, ఒకప్పుడు నిలిచిపోయిన ప్రాజెక్టులు, అస్పష్టమైన నిధులకు పేరుగాంచిన రంగాన్ని ప్రక్షాళన చేసింది. 'ది ఎకనామిస్ట్' పత్రిక 2023లోనే ఆ ప్రక్షాళన గురించి వివరించింది. ఇది న్యూఢిల్లీకి ఎలాంటి ఉపకారం చేసేందుకు చేయలేదు. అలాగే చమురు ఒత్తిడికి ప్రతిస్పందనగా ప్రభుత్వం ఏం చేసిందనేది కూడా ముఖ్యం. ధరల పెంపు భారాన్ని గృహాలపై, పరిశ్రమలపై మోపలేదు. ఆ వ్యయాన్ని ప్రభుత్వమే భరించింది. ఫిస్కల్ స్పేస్ (ఆర్థిక వెసులుబాటు) అందుకే ఉపయోగపడుతుంది, భారత్ ఈ వెసులుబాటును నిర్మించుకుంది. దానికి ఆధారాలు సెప్టెంబర్ 2న లభించాయి. జపాన్ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ ఇండియా రేటింగ్‌ను BBB+ నుండి 'A' కి పెంచింది మరియు స్టేబుల్ అవుట్‌లుక్‌తో దేశ సీలింగ్‌ను 'A' కి పెంచింది. ముప్పై ఏళ్లకు పైగా భారత్ 'A' రేటింగ్‌ను పొందలేదు. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, జీఎస్టీ, ఇన్సాల్వెన్సీ కోడ్ మరియు స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 1.8 శాతానికి తగ్గడాన్ని సదరు రేటింగ్ ఏజెన్సీ ఉదాహరించింది. అధిక మూలధన వ్యయాన్ని కొనసాగిస్తూనే, కేంద్రం తన ద్రవ్య లోటును ఆర్థిక ఏడాది 2025 లోని 4.7 శాతం నుండి ఆర్థిక ఏడాది 2026 నాటికి 4.4 శాతానికి తగ్గించిందని కూడా అది గుర్తించింది. టోక్యోలోని ఒక రేటింగ్ కమిటీకి ఢిల్లీలో ఎవరినీ సంతృప్తి పరచాల్సిన అవసరం లేదు. అది కూడా ఇదే సంస్కరణలను చదివి, ఇదే ముగింపుకు వచ్చింది.

ఇప్పుడు విమర్శల ప్రధాన అంశానికి వద్దాం. ఈ సూచీలు నేడు 7.8 శాతాన్ని సమర్థిస్తున్నట్లయితే, మునుపటి సంవత్సరాలలో ఇటువంటి వృద్ధి బలహీనమైన సూచీలతో కలిపి ఎందుకు వచ్చిందని రచయితలు ప్రశ్నిస్తున్నారు. వృద్ధి ఎల్లప్పుడూ ఒకే అంశాల ద్వారా మాత్రమే నడవాలనేది వారి భావన. కానీ అది అలా ఉండాల్సిన అవసరం లేదు. ఎగుమతులు మరియు సంఘటిత రుణాల ద్వారా నడిచే ఒక త్రైమాసికం, గృహ వ్యయం లేదా ప్రభుత్వ పెట్టుబడుల ద్వారా నడిచే సంవత్సరంతో పోలి ఉండదు. అంతకుముందు సంవత్సరాలకు వాటి స్వంత చోదక శక్తులు ఉన్నాయి. అవి ఆ సమయంలో స్పష్టంగా కనిపించాయి. 202425 వరకు, స్టాక్ మార్కెట్ బలోపేతమైంది. చాలా మంది భారతీయులు పెట్టుబడులు పెట్టడం ప్రారంభించారు. 202223 మరియు 202425 మధ్య గృహ నికర ఆర్థిక పొదుపులు 60 శాతానికి పైగా పెరిగాయి. నాన్‌బ్యాంకింగ్ మరియు సాంకేతికత ఆధారిత రుణాలు ఇచ్చే సంస్థలు వేగంగా విస్తరించాయి. వాణిజ్య రంగానికి మొత్తం వనరుల ప్రవాహం మూడు సంవత్సరాలలో 72 శాతం పెరిగింది. ఇందులో నాన్‌బ్యాంకింగ్ వాటా 96 శాతం. అవి వాస్తవ చోదక శక్తులు. అవి కేవలం భిన్నమైనవి మాత్రమే.


సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలకు ఇచ్చిన రుణాలు మార్చి 2023 మరియు మార్చి 2026 మధ్య 66.6 శాతం పెరిగాయి. జూలై 2026 లో కూడా ఇది దాదాపు 25 శాతం చొప్పున పెరుగుతూనే ఉంది. చమురు ఒత్తిడి వల్ల చిన్న సంస్థలే అత్యధికంగా దెబ్బతిన్నాయని అంటున్నారు. కానీ ఆ సంస్థలకు రుణాలు ఇచ్చిన బ్యాంకులు/సంస్థలు ఆ అభిప్రాయాన్ని పంచుకుంటున్నట్లు కనిపించడం లేదు. విఫలమవుతాయని భావించే సంస్థలకు రుణదాతలు సాధారణంగా అప్పులు ఇవ్వరు.

ఈ వాదన వెనుక, ప్రభుత్వాన్ని మంచిగా చూపించడానికే గణాంకాల మంత్రిత్వ శాఖ ఉందనే సూచన నడుస్తోంది. కానీ రికార్డులు దానికి మద్దతు ఇవ్వడం లేదు. 202324కి, మంత్రిత్వ శాఖ వృద్ధి అంచనాను (పాత సిరీస్ కింద) 9.2 శాతం నుంచి 7.3 శాతానికి సవరించింది. అంటే దాదాపు రెండు శాతం పాయింట్లను స్వచ్ఛందంగా వదులుకుంది. ఇతర చోట్ల కూడా ఆరోపణలకు అనుగుణంగా లెక్కలు లేవు.

202425లో, రియల్ గ్రోత్ పెరిగినప్పటికీ, కొత్త సిరీస్ కింద నామినల్ జీడీపీ వృద్ధి, పాత సిరీస్ నాటి 9.8 శాతంతో పోలిస్తే 9.4 శాతానికి తక్కువగా వచ్చింది. ప్రభుత్వం తన ద్రవ్య లక్ష్యాలకు నామినల్ జీడీపీని ప్రాతిపదికగా తీసుకుంటుంది. ప్రభుత్వం అత్యధికంగా ఉండాలని కోరుకునే సంఖ్య ఇదే. లెక్కలను కావాలని మార్చే ఏ మంత్రిత్వ శాఖ కూడా తన సొంత నష్టానికి మార్చదు. 202425 మరియు 202526 రెండింటినీ కలిపి చూస్తే, కొత్త సిరీస్ కింద సగటు రియల్ వృద్ధి 7.0 శాతం నుండి 7.5 శాతానికి పెరుగుతుంది. అది కేవలం అర శాతం పాయింట్ మాత్రమే. 202324 నుండి 202526 వరకు మూడేళ్లను తీసుకుంటే, పాత సిరీస్‌లోని 7.7 శాతంతో పోలిస్తే కొత్త సిరీస్‌లో సగటు వృద్ధి 7.4 శాతానికి తక్కువగా ఉంది.

రచయితలు ఒక సామెతతో ముగించారు. నేడు ఒకరికి వర్తించే సూత్రం, గతంలో మరొకరికి కూడా వర్తిస్తుందని వారు రాశారు. ఈ సూత్రం సరైనదే. దాన్ని పూర్తిగా అన్వయించాలని మాత్రమే మేము కోరుతున్నాము. మునుపటి సంవత్సరాల రికార్డులు కూడా ఉన్నాయి: గృహ పొదుపులు, రుణాల పెరుగుదల, వనరుల ప్రవాహం, పన్ను వసూళ్లు, విస్తరిస్తున్న పెట్టుబడిదారుల సంఖ్య. కొన్ని సూచీలను మాత్రమే ఎంచుకుంటే, గత చరిత్ర బలహీనంగా కనిపిస్తుంది. అన్నింటినీ తూకం వేసి చూస్తే, అది బలహీనంగా అనిపించదు. భారతదేశం ఒక పెద్ద ప్రతికూలతను తట్టుకుని, దశాబ్ద కాలంగా నిర్మించిన సామర్థ్యం మరియు సంపాదించిన ఆర్థిక వెసులుబాటుతో వృద్ధిని కొనసాగించింది. ఇది ఒక వాస్తవిక ఫలితం, కల్పితం కాదు.





రచయిత: డాక్టర్ సౌరభ్ గర్గ్ మరియు
డాక్టర్ వి. అనంత నాగేశ్వరన్. (భారత ప్రభుత్వ గణాంకాలు మరియు కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ కార్యదర్శి, భారత ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు)

# వెలుగులే మనకు చీకట్లు!



**మనం వాస్తవంగా ఒక అలసిన శతాబ్దంలో జీవిస్తున్నాం. ఈ ధరిత్రిపై భారత భూమికి సుదూర దేశాలలో గతించిన యుగాలలో నిర్మాణమైన మేధోసౌధం శిథిలాలలో నివసిస్తున్నాం. ఆ మేధోసౌధం మనదే అని విశ్వసిస్తున్నాం. అదొక తప్పుడు విశ్వాసం, భ్రమ. దానినుంచి బయటపడలేనితనం మనలను కుంగదీస్తోంది. ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట మానవ తప్పిదం కారణంగా ఏదో ఒక దుర్ఘటన సంభవిస్తోంది. నేపాల్ వరద బీభత్సం, గాజాలో జాతి సంహారం, డోనాల్డ్ ట్రంప్ అరాచకత్వం ప్రపంచాన్ని బాధిస్తున్నాయి, వేధిస్తున్నాయి. మన జీవనోన్నతికి ఏ భావాలయితే తోడ్పడాలో అవే మనకు వ్యతిరిక్తమయ్యాయి.'భవిష్యత్తుపై గతం తన వెలుగులు ప్రసరింపజేయడం మానేసినందున మనిషి మనసు అంధకారంలో సంచరిస్తోంది' అని రెండు శతాబ్దాల క్రితం అలెక్సిస్ డి టోక్‌విల్లే అనే ఫ్రెంచ్ మేధావి వ్యాఖ్యానించాడు. ఇప్పుడు మనమూ అటువంటి సంకటస్థితిలోనే ఉన్నాం. ఒక సంధికాలంలో కొట్టుమిట్టాడుతున్నాం. గతించిన కాలపు భావాలతో భవిష్యత్తులోకి వెళ్లడానికి ప్రయత్నించడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణం. యూరోప్ ఘనమైన గతం కానీ, అమెరికా ప్రశస్త వర్తమానం కానీ మన భవిష్యత్తుకు మార్గదర్శకాలు కాలేవు. పాశ్చాత్య ఆధునికత మాసిపోయింది. కొత్తదనాన్ని కోల్పోయింది. దుర్గంధాన్ని వెదజల్లుతోంది. అయినా మనం రోజూ దానికి మెరుగులు దిద్ది మన పిల్లలకు నేర్పుతున్నాం.**

ప్రజాస్వామ్యాన్నే తీసుకోండి. అదొక సమ్మోహన సమున్నత ఆదర్శం. గత శతాబ్దంలో అది ఒక విప్లవాత్మక భావం. ఇప్పుడు ప్రపంచానికి ప్రామాణిక ఆదర్శం. దానినే మనం ఉదారవాద ప్రజాస్వామ్యం అని పిలుస్తున్నాం. ప్రజా సార్వభౌమత్వం అనే మరో సమున్నత భావాన్ని పోటీదాయక ఎన్నికల ద్వారా అధిక సంఖ్యాకుల పాలన ప్రాతిపదికన ప్రాతినిధ్య ప్రభుత్వంగా మార్చివేశాం. అయితే మనం ప్రజాస్వామ్యంగా భావిస్తున్న పాలనా పద్ధతులు కొద్దిమందికి మాత్రమే స్వపరిపాలనను సమకూర్చాయి. ఆధునిక ప్రజాస్వామ్యం నిజానికి ప్రజలు సాధికారత కోల్పోయేలా చేసింది. రాజ్య వ్యవస్థను సర్వశక్తిమంతం చేసింది. నాయకత్వాలు జవాబుదారీతనం లేకుండా వ్యవహరించేందుకు తోడ్పడింది. మీడియా పూర్తిగా కార్పొరేట్ నియంత్రిత రంగం కావడానికి దోహదం చేసింది. ధనశక్తికి అపార ప్రాధాన్యమిచ్చింది. ఇవన్నీ ప్రజలను నిస్సహాయులను చేశాయి. ప్రజా సార్వభౌమత్వం బోలుమాటగా మిగిలిపోయింది. ప్రజాకర్షక రాజకీయాలు, మెజారిటీవాదం ఎన్నికైన నిరంకుశ ప్రభుత్వాలు.. ఆధునిక ప్రజాస్వామ్య రుగ్మతలు కావు, అవి మనం ప్రజాస్వామ్యంగా అంగీకరించి, అమలు జరుపుకుంటున్న యంత్రాంగం సహజ పరిణామాలు.

మన మరో గొప్ప ఆదర్శం జాతిరాజ్యం. ఏదో ఒక దానికి 'చెందిన' భావన, సొంతవారని భావించేవారితో సాంగత్యం, అనుబంధం పెంపొందించుకోవడం ప్రతి వ్యక్తికీ ఒక మానసిక అవసరం. ఆధునిక యుగంలో ప్రపంచాన్ని 'జాతులు' అనే రాజకీయ సమాజాలుగా విభజించి సుస్థిరపరచడం ద్వారా ఈ స్వతస్సిద్ధ మానవ అవసరాన్ని తీర్చారు. ఈ రాజకీయ సమాజాలే జాతి రాజ్యాలు. నిశితంగా పరిశీలిస్తే జాతులు అనేవి ఊహాజనిత సమాజాలు. ఇవి అధికార కేంద్రాలుగా పనిచేస్తూ తమ పరిధిలోని ప్రతి ఒక్కరి నుంచి తిరుగులేని విధేయతను కోరతాయి. ఇక్కడే, జాతి రాజ్యాలతో సమస్యలు తలెత్తుతున్నాయి. జాతి రాజ్యాల చరిత్రను చూస్తే అవి మనుషులను కలిపి ఉంచలేదు సరికదా వేరు చేశాయి. 'మనం', 'వారు' అనే భావనను నెలకొల్పి వైషమ్యాలు రెచ్చగొట్టాయి. ఈ రాజకీయ సమాజాల ప్రభావంతో ఇరుగుపొరుగు వారినీ ద్వేషించడం జరుగుతోంది. ఇరవయో శతాబ్ది యుద్ధాలే ఇందుకు నిదర్శనం. ఈ సంకుచిత జాతీయ వాదం జాత్యహంకారంగానూ, యుద్ధోన్మాదంగానూ వెర్రితలలు వేసింది, వేస్తోంది.

కూడు, గూడు, గుడ్డ మానవుని సహజ అవసరాలు. ఇవి అంత తేలిగ్గా తీరవు. తీరినా ఇంకా ఎన్నో కోరికలు ఉంటాయి. భౌతిక శ్రేయస్సును పరిపూర్ణంగా సమకూర్చుకోవాలని సదా స్వప్నిస్తాడు. ఆ స్వప్నసాధననే ఇరవయో శతాబ్దిలో 'అభివృద్ధి' అని చెప్పుకున్నారు. భౌతిక శ్రేయస్సును సమకూర్చుకోవడాన్ని మనం ఇప్పటికీ 'అభివృద్ధి'గా భావిస్తున్నాం. ఆ 'అభివృద్ధి' సాధనను ఒక ఉత్కృష్ట విషయంగా ఔదలదాలుస్తున్నాం. పారిశ్రామికీకరణ, పట్టణీకరణలతో అటువంటి అభివృద్ధిని సాధించాం.. ప్రైవేట్ ఆస్తి, స్వేచ్ఛా విపణి, అంతర్జాతీయ పెట్టుబడులకు ప్రాధాన్యమిచ్చే పెట్టుబడిదారీ ఆర్థిక విధానం ఆ అభివృద్ధికి ప్రధాన చోదకశక్తి. అయితే ఆ అభివృద్ధి స్వప్నాలు వికటిస్తున్నాయి. సిరిసంపదలు కొంతమందికి మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. సిరులు సృష్టించే శ్రమజీవులకు ఏమీ దక్కడం లేదు. జీవన ప్రమాణాలు ఇతోధికంగా మెరుగుపడినప్పటికీ మనిషి ఆకాంక్షలూ పెరిగిపోయాయి. ఫలితంగా సహజవనరులు తరిగిపోతున్నాయి. మన ధరిత్రి మానవుని అవసరాలను తీర్చగలదేగానీ అతడి అపరిమిత భోగలాలసను సంతృప్తిపరచలేదు. ఈ కారణంగానే పలు సంక్షోభాలు, ముఖ్యంగా పర్యావరణ విధ్వంసం సంభవిస్తోంది. దీనిని నిలిపివేయకపోతే ప్రకృతికి, మానవేతర జీవకోటికి, భావి తరాలకు తీరని నష్టం వాటిల్లడం ఖాయం. విధ్వంసక అభివృద్ధి, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం అనేవి మనం అనుసరిస్తున్న ఆర్థికాభివృద్ధి నమూనా లోపాలు కాదు, అవి దాని సహజ లక్షణాలు.

అజ్ఞానం, అసత్యాల నుంచి స్వేచ్ఛ సాధించడమే మన నాలుగో అన్వేషణ. ఆధునిక వైజ్ఞానిక పద్ధతి ఇందుకు తోడ్పడుతోంది. సమస్త జ్ఞాన రంగాలు అనుసరించాల్సిన నిర్దిష్ట నియమావళిని అది రూపొందించింది. ఏది సత్యం, ఏదసత్యం అనేదాన్ని నిర్ధారించింది. దీని ప్రకారం ఏది జ్ఞానం? సర్వత్రా ఒకే విధమైన ఫలితాలను ఇచ్చేది, క్రమబద్ధమైన ధ్రువీకరణకు సాధ్యమయ్యేదే ప్రామాణిక జ్ఞానం. సాంకేతిక విజయాలు ఆ జ్ఞానానికి అంతిమ రుజువు. ఈ పద్ధతి మానవ సమస్యలను పరిష్కరించడంలో సఫలమవుతున్నందున విజ్ఞానశాస్త్రం మన కాలపు కొత్త మతంగా పరిగణన పొందింది. అయితే అది మానవ మేధను సంకుచిత పరిచింది. నైతిక ప్రాతిపదికలు కోల్పోయేలా చేసింది. పాశ్చాత్య మేధో ఆధిపత్యాన్ని నెలకొల్పింది.

ప్రతి మనిషీ సంతోషమయ జీవితాన్ని కోరుకుంటాడు, మానసిక సాంత్వనలకూ ఆరాటపడతాడు. భౌతిక సౌఖ్యం, మానసిక ప్రశాంతికి మానవుని అన్వేషణను మనం విధిగా పట్టించుకోవాలి. పాశ్చాత్య ఆధునికతతో అంకురించి ప్రపంచవ్యాప్తమైన 'లౌకికవాదం' అన్ని మతాల స్వభావాన్ని మార్చివేసింది. సమస్త సమాజాలూ లౌకికవాద భావజాలాన్ని ఆచరణలో కాకపోయినా సూత్రప్రాయంగా అంగీకరిస్తున్నాయి. మతం క్షీణించకపోగా నిర్దిష్ట మతపరమైన అనుయాయులను మరింత మతనిష్ఠతో వర్గీకరించడం జరుగుతోంది. విభిన్న మత వర్గాల మధ్య పోటీ పెచ్చరిల్లుతోంది. దీనివల్ల మత పరమార్థం ఉపేక్షితమవుతోంది. ప్రతి మతంలోను వ్యాపార, ఛాందసవాద ధోరణులు పెరుగుతున్నాయి. ఆధునిక మానవుడు గత తరాల కంటే సుఖసంతోషాలతో బతుకుతున్నాడని, అతడి జ్ఞానసంచయం మున్నెన్నడూ లేని రీతిలో అపారమైనదని మీరు అనవచ్చు. కానీ, మన తాత ముత్తాతల కంటే మనం సంతోషంగా జీవితాన్ని గడుపుతున్నామని మీరు చెప్పగలరా?

'భూత' అనే పదానికి మరో అర్థం కూడా ఉన్నది. అది భౌతిక జగత్తులోని ప్రాథమిక పదార్థాలను సూచిస్తుంది. హిందూ మత గ్రంథాల ప్రకారం ఆ ప్రాథమిక పదార్థాలు ఐదు. అవి: భూమి, నీరు, గాలి, అగ్ని, ఆకాశం. ఆధునిక మానవుని స్వతస్సిద్ధ స్వభావంలోనూ అటువంటి అయిదు ప్రాథమిక అంశాలను మనం గుర్తించాలని 21వ శతాబ్దం ఆహ్వానిస్తోంది. ఆ స్వాభావిక మానవ అవసరాలు: స్వయం ప్రతిపత్తి, అనుబంధం, శ్రేయస్సు, సత్యం, ఆనందం. గత శతాబ్దపు రాజకీయ, సామాజిక, ఆర్థిక నిర్మాణాలు ఈ అవసరాలను తీర్చడంలో విఫలమయినందున మనం కొత్త వ్యవస్థలను నిర్మించుకోవాలి. ఇందుకు మనం పాత ఆధిపత్య చింతనా ధోరణులకు భిన్నంగా ఆలోచించవలసి ఉంది. ఇప్పటివరకు మనలను ప్రభావితం చేస్తున్న పాశ్చాత్య ఆధునికత ప్రభావశీలత కృశించిపోతోంది. దాని వెలుగులు క్షీణించిపోతున్నాయి. పాశ్చాత్యేతర సమాజాలలో సమున్నత జ్ఞాన సంప్రదాయాలు ఉన్నాయని, అవి మన జీవితాలను అర్థవంతం, ఆనందప్రదం చేసేందుకు యోగ్యమైన ప్రత్యామ్నాయ ఆలోచనా స్రవంతులను సమకూరుస్తాయనే సత్యాన్ని గుర్తించాలి. పాశ్చాత్య ఆధునికతకు భిన్నమైన భావ సాహసాలు చేయగలిగితే 21వ శతాబ్దాన్ని భూతకాలంగా (దాని అత్యుత్తమ అర్థంలో) మార్చుకోగలమనడంలో సందేహం లేదు.

# జిల్లాలో మంచినీటి సమస్య తలెత్తరాదు

**- వ్యవసాయ అధికారులు ఈ-పంట నమోదు 100% పూర్తి చేయాలి**
**- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**



**అనంతపురం, సెప్టెంబర్ 7,అనంత జనశక్తి న్యూస్**

ప్రస్తుత వర్షాభావ పరిస్థితులలో జిల్లాలో ఎక్కడా మంచినీటి సమస్య తలెత్తకూడదని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్
సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ ఆర్డబ్ల్యూఎస్, డ్వామా, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాభావ పరిస్థితులలో జిల్లాలో ఎక్కడ కూడా మంచినీటి సమస్య తలెత్తకూడదని ఆర్డబ్ల్యూఎస్ అధికారులు అన్ని మండలాల ఎంపీడీవోలకు మరియు అన్ని సంక్షేమ వసతిగృహాల డిడిలకు సూచించారు. ఎల్ నినో పరిస్థితుల ప్రభావంతో ప్రస్తుతం వర్షాలు పడే అవకాశం లేదన్నారు. ఈ విషయాన్ని అధికారులు దృష్టిలో ఉంచుకొని జిల్లాలో మంచినీటి సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎక్కడైనా మంచినీటి సమస్య ఉన్నట్లు తమ దృష్టికి వచ్చినట్లయితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ఉన్న అన్ని సంక్షేమ వసతి గృహాలు, ఏపీ మోడల్ స్కూల్స్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మరియు రెసిడెన్షియల్ పాఠశాలలో నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మరియు ప్లాంటేషన్ కార్యక్రమానికి సంబంధించి మీకు ఇచ్చిన టార్గెట్ నెల రోజుల లోపల పూర్తి చేయాలన్నారు.
వి బి జి రామ్ జి పథకం ద్వారా జాబ్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికి పనులు కల్పించి జిల్లాకు కేటాయించిన టార్గెట్ పూర్తి చేయాలన్నారు. విబిజి రాంజీ పథకంలో ఎస్సీ ఎస్టీలకు 100% పనులు కల్పించాలన్నారు. ఐ గాట్ కర్మయోగి కార్యక్రమానికి సంబంధించి జిల్లాలో శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలు పూర్తి చేసేందుకు ప్రతి ఉద్యోగి ఐగాట్ కర్మయోగి కోర్సులు పూర్తి చేసే విధంగా సంబంధిత నోడల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.
వర్షాభావ పరిస్థితుల వల్ల జిల్లాలో చాలా వరకు పంటలు దెబ్బతినే అవకాశం ఉందని ఈ విషయాన్ని అన్ని మండలాల మండల వ్యవసాయ శాఖ అధికారులు దృష్టిలో ఉంచుకొని రైతులు వేసిన ప్రతి పంట 100% ఈ పంట నమోదు చేయించాలన్నారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ జెడి సాలు రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డిడి శైలజ, ఉద్యానవన శాఖ ఏడి ఉమాదేవి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఐ ఆర్ 30 శాతం ప్రకటించాలి.



**- టెట్ మినహాయింపు ఇవ్వాలి.**
**- ఏపీటీఎఫ్ డిమాండ్.**


**సత్యసాయి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 7, అనంత జనశక్తి న్యూస్:**

పీఆర్సీ కమిటీ నియమించేలోపు 30% ఐ ఆర్ ను వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ బి కె ముత్యాలప్ప, జిల్లా ఉపాధ్యక్షులు సానే రవీంద్ర రెడ్డి డిమాండ్ చేసారు. కనగానపల్లి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి లు చంద్ర శేఖర్,మహమ్మద్ రఫీ ఆధ్వర్యం లో ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం లో పాల్గొన్న వారు మాట్లాడుతూ..... పీఆర్సీ కమిటీ ఏర్పాటు పేరుతో ఇంకా జాప్యం జరిగితే ఉద్యోగ ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. ఆలోపు 30% ఐ ఆర్ ప్రకటించాలని, డి ఏ, ఇ ఎల్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉన్నత ,మోడల్ స్కూల్స్ లో మిషన్ మార్చ్ పేరుతో ఉపాధ్యాయులు మానసిక వత్తిడికి గురిఅవుతున్నారు అని దీనిపై పునరాలోచన చేయాలని కోరారు. 2010 కంటే ముందే నియమింపబడిన సీనియర్ ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు సాంబశివారెడ్డి, బాబాజాన్,రామకృష్ణ, మహేంద్ర రెడ్డి, ఆంజినేయులు,నరసింహ మూర్తి,నాగేంద్ర కృష్ణయ్య,తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమాన్ని మాటల్లోనే కాదు...

**- గణాంకాల్లో కూడా చూపిస్తున్నాం**
**- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**

**మంగళగిరి/అమరావతి సెప్టెంబర్ 07**
**అనంత జనశక్తి న్యూస్**




ప్రజలు తమ ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నామని, ప్రతి కుటుంబానికి అండగా ఉన్నామనే భరోసా కల్పిస్తున్నామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో కేవలం రెండేళ్లలో 90 శాతం అమలు చేశామని, మాటల్లో కాకుండా గణాంకాల్లో కూడా చూపిస్తున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రైతు, మహిళ, విద్యార్థి, బీసీ, మత్స్యకారుడు, చేనేత కార్మికుడు, దివ్యాంగుడు.. ఇలా ప్రతి వర్గానికీ అండగా నిలుస్తున్నామన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నుంచి ప్రారంభమైన తెలుగుదేశం లీడర్ షిప్ కాంక్లేవ్ సందర్భంగా మంత్రి సవిత ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో చేపట్టిన సంక్షేమ పథకాలను వెల్లడించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పాలిస్తోందన్నారు. ప్రజల సంక్షేమం కోసం భారీగా నిధులు ఖర్చు చేసి, మాట నిలబెట్టుకున్న ప్రభుత్వంగా నిలిచామని తెలిపారు. 24 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని, దీనిలో భాగంగా రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు తీసుకొచ్చి యువత భవిష్యత్తుకు బాటలు వేస్తున్నామని తెలిపారు. పేదలందరికీ విద్య హక్కు కల్పించడంలో భాగంగా తల్లికి వందనం పథకంలో భాగంగా ఏటా 67.27 లక్షల మంది విద్యార్థులకు ఏటా రూ.15వేల చొప్పున అందిస్తున్నామన్నారు. ఇందుకోసం రెండేళ్లలో రూ.20,090 కోట్లు ఖర్చు చేశామని మంత్రి సవిత తెలిపారు. పెనుకొండ నియోజకవర్గంలోనే తల్లికి వందనం కింద 32,969 మంది విద్యార్థులకు రూ.49.45 కోట్లు అందించామని, ప్రతి విద్యార్థి చదువుకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు.

**90 శాతం హామీలు అమలు చేశాం**

అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఎన్నికల్లో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 90 శాతం అమలు చేశామని మంత్రి సవిత తెలిపారు. అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతు కుటుంబానికీ ఏటా రూ.20 వేలు అందిస్తున్నామన్నారు. రెండేళ్లలో 46 లక్షల మంది రైతులకు రూ.14,664 కోట్లు పెట్టుబడి సాయంగా అందించామన్నారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే తమ లక్ష్యమన్నారు. 31.52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.1,100 కోట్లు రైతులకు చెల్లించామన్నారు. మహిళల ఉచిత ప్రయాణానికి శ్రీకారం చుట్టామని, ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 87 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని తెలిపారు. ఇందుకోసం రూ.3,218 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. మహిళల వంటింటి భారం తగ్గించేందుకు దీపం2 పథకంలో 4.57 కోట్ల ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించామన్నారు. గ్యాస్ సబ్సిడీ కోసం రూ.3,800 కోట్ల ఆర్థిక భారాన్ని ప్రభుత్వమే భరిస్తోందన్నారు. పెనుకొండలో దీపం2 పథకం కింద 5.74 లక్షల ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించామని, ఇందుకోసం రూ.49.25 కోట్ల సబ్సిడీని అందజేశామని మంత్రి సవిత తెలిపారు.

**బీసీల రాజకీయ సాధికారతే లక్ష్యం**

బీసీలకు రాజకీయంగా మరింత ప్రాధాన్యం కల్పించామని, నామినేటెడ్ పదవుల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. బీసీలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపామన్నారు బీసీల రాజకీయ సాధికారతే తమ లక్ష్యమని స్పష్టంచేశారు. స్థానిక సంస్థల్లోనూ 34 శాతం రిజర్వేషన్ల కోసం ముందుకు సాగుతున్నామన్నారు. గత ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించిందన్నారు. దాని వల్ల 16,800 రాజకీయ పదవులను బీసీలు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. బీసీలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దడానికి కృషి చేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు.

**బీసీల ఆత్మగౌరవానికి పెద్దపీట**

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 138 బీసీ కులాల ఆత్మగౌరవానికి, రక్షణకు పెద్దపీట వేస్తూ, బీసీ ప్రొటెక్షన్ యాక్ట్2026 తీసుకురావడానికి చర్యలు చేపట్టామని మంత్రి సవిత తెలిపారు. బీసీల హక్కుల పరిరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేశామని, 50 ఏళ్లు పైబడిన 1,30,796 మంది మత్స్యకారులకు రూ.505 కోట్ల మేర పింఛన్లు అందించామని తెలిపారు. వేట నిషేధ భృతిని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచామన్నారు. చేనేత కార్మికులకు కూడా అండగా నిలిచామని, 50 ఏళ్లు పైబడిన 85,940 మంది చేనేత కార్మికులకు రూ.844 కోట్ల పింఛన్లు అందించామని తెలిపారు. 62,541 నేతన్నల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. నేతన్నల సేవలో పథకం కింద మగ్గం కలిగిన ప్రతి నేతన్నకూ రూ.25 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు.

**మాటల్లో కాదు గణంకాల్లో చూపిస్తున్నాం**

దివ్యాంగుల సంక్షేమంలోనూ కూటమి ప్రభుత్వం ముందుందని మంత్రి సవిత తెలిపారు. దివ్యాంగుల పింఛన్లను రూ.6వేలకు పెంచామన్నారు. దివ్యాంగుల ఆత్మగౌరవం కోసం 1,750 మందికి మూడు చక్రాల వాహనాలు అందించామని, ఇందుకోసం రూ.18.47 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. పేదల సంక్షేమానికే తమ ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యం ఇస్తోందని, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తున్నామని తెలిపారు. రైతు, మహిళ, విద్యార్థి, బీసీ, మత్స్యకారుడు, చేనేత కార్మికుడు, దివ్యాంగుడు.. ఇలా ప్రతి వర్గానికీ కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. సంక్షేమాన్ని కేవలం మాటల్లో కాకుండా గణాంకాల్లో చూపిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు.

# టిడిపి లీడర్షిప్ కాంక్లేవ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే అమిలిలేని

**కళ్యాణదుర్గం సెప్టెంబర్ 07, అనంత జనశక్తి న్యూస్**



టిడిపి కేంద్ర కార్యాలయంలో టిడిపి జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు , జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన లీడర్షిప్ కాంక్లేవ్‌లో కళ్యాణదుర్గం శాసనసభ్యులు అమిలినేని సురేంద్రబాబు పాల్గొన్నారు. పార్టీ బలోపేతం, ప్రజా పాలన, ప్రభుత్వ సంక్షేమ-అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా తీసుకెళ్లడం, రాబోయే కార్యక్రమాలను ఉద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. ఈ లీడర్షిప్ కాంక్లేవ్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, పొలిట్ బ్యూరో సభ్యులు, జోనల్ ఇంఛార్జ్‌లు, జిల్లా అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్కేయూలో యూనియన్ బ్యాంక్ పునరుద్ధరించిన శాఖ ప్రారంభం



**అనంతపురము, సెప్టెంబర్ 7 అనంత జనశక్తి న్యూస్**

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పునరుద్ధరించిన శాఖను సోమవారం ఘనంగా ప్రారంభించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్ ముఖ్య అతిథిగా హాజరై శాఖను ప్రారంభించారు. రెక్టర్ ఆచార్య బి. అనిత, రిజిస్ట్రార్ డా. ఇ. రమేష్ బాబు గౌరవ అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి యూనియన్ బ్యాంక్ అందిస్తున్న సేవలను అభినందించారు. విద్యార్థులకు సంబంధించిన బ్యాంకింగ్ సేవలను పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేసి, వేగంగా అందుబాటులోకి తీసుకురావాలని బ్యాంకు అధికారులను కోరారు. దీంతో విద్యార్థుల సమయం ఆదా కావడంతో పాటు సేవలు సులభతరం అవుతాయని తెలిపారు.బ్యాంకు అధికారులు వివిధ సేవలు, సంక్షేమ పథకాలు, ఉద్యోగులకు అందిస్తున్న బీమా సదుపాయాలను వివరించారు. ఉద్యోగులకు రూ.1.10 కోట్ల వరకు జీవిత బీమా, సాధారణ మరణం సంభవించిన సందర్భంలో రూ.10 లక్షల వరకు బీమా సదుపాయం ఉన్నట్లు తెలిపారు.పదవీ విరమణ పొందిన న్యాయశాస్త్ర ఆచార్యులు ప్రొఫెసర్ జ్యోతి విజయకుమార్, ఎంబీఏ విభాగం ప్రొఫెసర్ మురళీకృష్ణ బ్యాంకుతో తమకున్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. బ్యాంకు సిబ్బంది అందిస్తున్న ఆప్యాయమైన సేవలను ప్రశంసించారు.అనంతరం బ్యాంకు ఆవరణలో అతిథులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో తిరుపతి జోనల్ హెడ్ పాత్రి శ్రీనివాస కుమార్, అనంతపురం రీజినల్ హెడ్ వంశీ కృష్ణ తాడూరి, శాఖ మేనేజర్ చంద్రశేఖర్ మేకలతో పాటు విశ్వవిద్యాలయ అధ్యాపకులు, బ్యాంకు అధికారులు, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ 25 ఏళ్ల సేవా ప్రయాణం.




**- రాబోయే ఎన్నికల్లో బిజెపి సత్తా చాటాలని పిలుపు**

**అనంతగిరి,అనంత జన శక్తి న్యూస్ సెప్టెంబర్ 7 :**

నరేంద్ర మోడీ 25 ఏళ్ల ప్రజాసేవ పురస్కరించుకుని బిజెపి సమావేశం కార్యకర్తలతో ఘనంగా నిర్వహించారు. స్థానిక, సంస్థాగత ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలని పిలుపు
ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా, భారత ప్రధానిగా సుదీర్ఘకాలంగా అందిస్తున్న 25 ఏళ్ల ప్రజాసేవను పురస్కరించుకుని బిజెపి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బిజెపి జిల్లా అధ్యక్షురాలు మట్టం శాంతి కుమారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలరావు, జిల్లా ఇన్చార్జి పుట్ట గంగయ్య, కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు శెట్టి రాజుల నేతృత్వంలో ఈ వేడుకలు జరిగాయి.
ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు మట్టం శాంతి కుమారి మాట్లాడుతూ, నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని కొనియాడారు. బిజెపి శ్రేణులు మరింత పట్టుదలతో పనిచేసి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయాన్ని ఖాయం చేసి బిజెపి సత్తా చాటాలని పిలుపునిచ్చారు.
అంతేకాకుండా, సంస్థాగత ఎన్నికల్లోనూ పార్టీ జెండాను ఎగురవేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని నొక్కిచెప్పారు. బూత్ స్థాయి నుండి పార్టీ నిర్మాణాత్మక వ్యవస్థను బలోపేతం చేసి, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరియు ప్రధాని మోడీ సాధించిన విజయాలను ఇంటింటికీ తీసుకెళ్లడం ద్వారా స్థానిక, సంస్థాగత ఎన్నికలన్నింటిలో బిజెపి స్పష్టమైన ఆధిపత్యాన్ని సాధించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు, మండల కమిటీలు గ్రామ కమిటీలు బూత్ కమిటీలు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యాశాఖ మాత్యులు నిర్దేశించిన అడ్మిషన్ల లక్ష్యాన్ని సాధించాం డాక్టర్ విజయలక్ష్మి

**రాయదుర్గం, సెప్టెంబర్ 7, అనంత జనశక్తి న్యూస్**



ఆంధ్ర ప్రదేశ్ విద్యాశాఖ మాత్యులు నారా లోకేష్ నిర్దేశించిన అడ్మిషన్ల లక్ష్యాన్ని సాధించామని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. విజయలక్ష్మి తెలిపారు. సోమవారం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరానికి గాను అడ్మిషన్లు భారీగా పెరిగాయని కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఉమ్మడి కృషితో పాటు ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ, విద్యా పథకాలే ఈ విజయానికి కారణమని ఆమె పేర్కొన్నారు.గత విద్యాసంవత్సరం (202526)లో కళాశాలలో 570 అడ్మిషన్లు నమోదు కాగా, ప్రస్తుత విద్యాసంవత్సరం (202627) లో ఆ సంఖ్య 620 కి చేరింది. దీనితో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నిర్దేశించిన 10% పెరుగుదల అడ్మిషన్ల లక్ష్యాన్ని (టార్గెట్) కళాశాల విజయవంతంగా చేరుకుందని ప్రిన్సిపాల్ సంతోషం వ్యక్తం చేశారు. అడ్మిషన్ల పెరుగుదలకు తోడ్పడిన ప్రభుత్వ పథకాలు తల్లికి వందనం,సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకం, విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ,ప్రత్యేక స్టడీ మెటీరియల్స్, పోటీ పరీక్షల కోసం సంకల్ప్ మెటీరియల్, నీట్ (NEET) మెటీరియల్ అందజేత, ప్రాక్టికల్స్ మద్దతు సైన్స్, వొకేషనల్ కోర్సుల విద్యార్థులకు ఉచితంగా రికార్డుల పంపిణీ, విద్య శక్తి పథకం ద్వారా నీట్ (NEET) ఇంజనీరింగ్, (EAPCET) పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం ఉచిత ఆన్లైన్ తరగతుల నిర్వహణ, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం,
జిల్లా DVEO, SVS గురవయ్య శెట్టి, RIO వెంకటరమణ నాయక్ సలహాలు, సూచనలతో ఈ విజయాన్ని చేరుకున్నామని తెలుపుతూ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే అడ్మిషన్ల పెంపునకు అహర్నిశలు కృషి చేసిన అధ్యాపక బృందాన్ని మరియు సిబ్బందిని ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చేరే విద్యార్థులకు మరో అవకాశాన్ని సెప్టెంబర్ 15 వరకు కల్పించింది. విద్యార్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో సంప్రదించి అడ్మిషన్ పొందవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కరువు సమస్యల పరిష్కారానికి సీపీఐ వినతిపత్రం..

**గాండ్లపెంట, సెప్టెంబర్,7, అనంత జనశక్తి న్యూస్,**

మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నరసింహులుకు సోమవారం సీపీఐ మండల కార్యదర్శి శ్రీరాముల నాయుడు వినతిపత్రం అందజేశారు. మండల వ్యాప్తంగా నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో
ఉంచుకుని ప్రజలు, రైతులు, పశుపోషకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని
ఆయన కోరారు.ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి శ్రీరాముల నాయుడు మాట్లాడుతూ
మండల వ్యాప్తంగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ప్రతి గ్రామానికి సక్రమంగా తాగునీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. పశువులకు మేత కొరత ఏర్పడిన నేపథ్యంలో వెంటనే గడ్డి కేంద్రాలను ఏర్పాటు
చేసి పశుపోషకులను ఆదుకోవాలని కోరారు.
ఎన్నడూ ఎరగని రీతిలో కరువు పరిస్థితులు నెలకొనడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి మూడు సంవత్సరాలు గడిచినా ప్రజలకు ఎలాంటి ప్రయోజనం అందలేదని అన్నారు
. రైతుల వ్యవసాయ రుణాలను మాఫీ చేసి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంత ప్రజలకు విస్తృతంగా పనులు కల్పించి వలసలను నివారించాలని కోరారు. అదేవిధంగా ప్రతి స్వర్ణ గ్రామం పరిధిలో ప్రజలకు అందుబాటులో అధికారులు ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రామాంజులు, గంగిరెడ్డి, తిమ్మయ్య, చెన్నకేశవులు, వలి సాబ్, వేణు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.





# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు ఖండించిన ఎమ్మెల్యే కసిరెడ్డి

హైదరాబాద్ సెప్టెంబర్ 07, అనంత జనశక్తి న్యూస్

అసెంబ్లీ స్పీకర్‌పై ఓ ఎమ్మెల్సీ అనుచిత, అసభ్యకర వ్యాఖ్యలు చేయడాన్ని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తీవ్రంగా ఖండించారు.రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిలో ఉన్న స్పీకర్‌ను వ్యక్తిగతంగా కించపరిచేలా మాట్లాడటం ప్రజాస్వామ్య వ్యవస్థకు, శాసనసభ గౌరవానికి అవమానమని అన్నారు.రాజకీయ విభేదాలు, విధానాలపై విమర్శలు ఉండొచ్చని, అయితే రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తిని అవమానించేలా మాట్లాడటం సమర్థనీయం కాదని పేర్కొన్నారు. ముఖ్యంగా దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్నప్పటికీ ఇలాంటి వ్యాఖ్యలకు గురికావడం ఆందోళనకరమన్నారు.దళితులు ఉన్నత విద్య, ఉన్నత పదవులు సాధించినప్పటికీ వారిపై వివక్ష, చిన్న చూపు, అవమానకర వైఖరి కొనసాగడం దురదృష్టకరమని కసిరెడ్డి అన్నారు. ప్రజాప్రతినిధులు తమ హోదా, బాధ్యతలను గుర్తించి మాట్లాడాలని, రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడాలని సూచించారు. సదరు ఎమ్మెల్సీపై శాసనసభ నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు.

# తాతా మధుసూదన్ వెంటనే రాజీనామా చేయాలి

## - స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై వ్యాఖ్యలను ఖండించిన ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గ ప్రసాద్

ఖమ్మం సెప్టెంబర్ 07, అనంత జనశక్తి న్యూస్



తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గ ప్రసాద్ తీవ్రంగా ఖండించారు. దళిత బిడ్డపై అవమానకరంగా మాట్లాడిన తాతా మధుసూదన్ వెంటనే తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.శాసనసభ స్పీకర్ పదవి రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవుల్లో ఒకటని, ఆ పదవికి గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందన్నారు. దళితుడు స్పీకర్‌గా ఉన్నత పదవికి ఎదగడం రాజ్యాంగం కల్పించిన సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలకు నిదర్శనమని పేర్కొన్నారు.దళితుల పట్ల అవమానకరంగా, అనుచితంగా మాట్లాడే హక్కును రాజ్యాంగం ఎవరికీ ఇవ్వలేదని పువ్వాళ్ల దుర్గ ప్రసాద్ అన్నారు. తాతా మధుసూదన్ కూడా ప్రజాస్వామ్య వ్యవస్థ, రాజ్యాంగం ద్వారా ఎమ్మెల్సీగా ఎన్నికై ఈ స్థాయికి వచ్చారని గుర్తుంచుకోవాలని సూచించారు.స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు తాతా మధుసూదన్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, ఎమ్మెల్సీ పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను ఇకపై సహించేది లేదని, సామాజిక సమానత్వం, రాజ్యాంగ విలువల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పువ్వాళ్ల దుర్గ ప్రసాద్ అన్నారు.

# అసెంబ్లీ నిబంధనలు ఉల్లంఘిస్తే సహించేది లేదు

## - బీఆర్ఎస్ నేతల అనుచిత ప్రవర్తనను ఖండించిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి

హైదరాబాద్ సెప్టెంబర్ 07 అనంత జనశక్తి న్యూస్




అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ నేతలు వ్యవహరించిన తీరు అనుచితంగా ఉందని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. సభా నిబంధనలు, భద్రతా విధానాలను ఉల్లంఘిస్తూ గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నించడం సరికాదన్నారు.బీఆర్ఎస్ నేతలు టీషర్టులపై వివాదాస్పద పదాలను ప్రదర్శిస్తూ అసెంబ్లీ ప్రాంగణంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నప్పటికీ, నిరసన పేరుతో సభా నిబంధనలు ఉల్లంఘించడం, అసెంబ్లీ కార్యకలాపాలకు ఆటంకం కలిగించడం సమర్థనీయం కాదన్నారు.ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడం, అసెంబ్లీ కార్యకలాపాలకు అంతరాయం కలిగించడం, ప్రజల్లో గందరగోళం సృష్టించడమే లక్ష్యంగా బీఆర్ఎస్ వ్యవహరిస్తోందని జీఎంఆర్ ఆరోపించారు.

**బీజేపీ–బీఆర్ఎస్ కుమ్మక్కు**

బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒకే విధంగా వ్యవహరిస్తున్నాయని జీఎంఆర్ విమర్శించారు. బయటకు వేర్వేరు పార్టీలుగా కనిపించినప్పటికీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరించే విషయంలో రెండింటి తీరు ఒకేలా ఉందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై ప్రజాప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు, ప్రభుత్వంపై బురదజల్లేందుకు రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు.చట్టాన్ని, అసెంబ్లీ నిబంధనలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే నిరసనలు, రాజకీయ కార్యక్రమాలు నిర్వహించాలని ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి సూచించారు.

# పొన్నాడ సూర్యప్రకాష్‌కు ఆసియా పసిఫిక్ 'ఇంజనీర్ ఆఫ్ ది ఇయర్' పురస్కారం

హైదరాబాద్, సెప్టెంబర్ 7:అనంత జనశక్తి న్యూస్

హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సివిల్, నిర్మాణ ఇంజనీర్ ఎర్. పొన్నాడ సూర్యప్రకాష్‌కు ప్రతిష్టాత్మకమైన 'ఆసియాపసిఫిక్ సంవత్సరపు ఇంజనీర్-2026' పురస్కారం లభించింది. దీంతో పాటు ఆసియాపసిఫిక్ ఇంజనీరింగ్ సంస్థల సమాఖ్య గౌరవ ఫెలోషిప్‌ను కూడా ఆయన అందుకున్నారు. మలేషియాలోని శరావాక్ రాష్ట్రం కుచింగ్‌లో జరిగిన ఆసియాపసిఫిక్ ఇంజనీరింగ్ సంస్థల సమాఖ్య 34వ వార్షిక సమావేశంలో ఈ పురస్కారాలను ప్రదానం చేశారు. ఆసియాపసిఫిక్ ప్రాంతంలోని 28 సభ్య దేశాలకు చెందిన సుమారు 500 మంది ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు.భారత ఇంజనీర్ల సంస్థ మండలి సభ్యుడిగా ఉన్న సూర్యప్రకాష్‌ను ఆ సంస్థ ఈ అంతర్జాతీయ పురస్కారానికి నామినేట్ చేసింది. దాదాపు నాలుగు దశాబ్దాలుగా ఇంజనీరింగ్ రంగంలో ఆయన అందించిన విశిష్ట సేవలు, సాంకేతిక ఆవిష్కరణలు, వృత్తిపరమైన నాయకత్వానికి గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది.ఈ సందర్భంగా సూర్యప్రకాష్ మాట్లాడుతూ 28 దేశాల ప్రతినిధుల సమక్షంలో ఈ పురస్కారం, గౌరవ ఫెలోషిప్ అందుకోవడం తనకు ఎంతో గర్వకారణమన్నారు. ఈ గౌరవం భారతదేశానికి, తనను తీర్చిదిద్దిన భారత ఇంజనీర్ల సంస్థకు, ఆంధ్రప్రదేశ్‌లోని తన స్వగ్రామం రాజోలుకు దక్కిన అరుదైన గౌరవమని పేర్కొన్నారు.



నిర్మాణాలు చేపట్టడంతో పాటు దేశ నిర్మాణంలోనూ ఇంజనీర్ల పాత్ర కీలకమని అన్నారు. ఈ పురస్కారాన్ని ఆసియాపసిఫిక్ ప్రాంతంలోని యువ ఇంజనీర్లకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు.వాతావరణ మార్పులు, సుస్థిర అభివృద్ధి, గ్రామీణ పునర్నిర్మాణం వంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు దేశాల సరిహద్దులకు అతీతంగా ఇంజనీర్లు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

**నాలుగు దశాబ్దాల సేవలు**

ఎన్‌టీయూ కాకినాడలో సివిల్ ఇంజనీరింగ్‌లో పట్టభద్రుడైన సూర్యప్రకాష్, ఐఐటీ మద్రాస్‌లో నిర్మాణ ఇంజనీరింగ్‌లో ఉన్నత విద్యను అభ్యసించారు. 1994లో సత్యవాణి ప్రాజెక్ట్స్ అండ్ కన్సల్టెంట్స్ సంస్థను స్థాపించారు. సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసి ఇప్పటివరకు 10 వేల మందికి పైగా ఇంజనీర్లకు మార్గదర్శకత్వం వహించారు.ఇంజనీర్ల సంఘం మాజీ జాతీయ అధ్యక్షుడిగా, భారత భవనాల కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర కేంద్ర అధ్యక్షుడిగా, పీఎస్ఐ వ్యవస్థాపక అధ్యక్షుడిగా, భారత ఇంజనీర్ల సంస్థ సివిల్ ఇంజనీరింగ్ విభాగం మాజీ అధ్యక్షుడిగా పలు కీలక బాధ్యతలు నిర్వహించారు.సుమారు రూ.లక్ష కోట్ల విలువైన ప్రభుత్వ మౌలిక వసతుల ప్రాజెక్టుల పరిశీలన కమిటీల్లో సభ్యుడిగా పనిచేశారు. భూకంప ప్రభావిత నిర్మాణాల పటిష్టతను అంచనా వేయడంతో పాటు నివాస, వాణిజ్య, పారిశ్రామిక సముదాయాలు, మెట్రో రైలు, క్రీడా మైదానాలు, వంతెనల నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు.కమ్యూనికేషన్ టవర్లు, నిర్మాణ రంగంలోని ప్రామాణిక విధానాలపై పలు పుస్తకాలు రచించారు. ఆయన రూపొందించిన సాంకేతిక సాఫ్ట్‌వేర్‌కు 2007లో ఉత్తమ సాఫ్ట్‌వేర్ పురస్కారం లభించింది.గతంలో భారత ఇంజనీర్ల సంస్థ ద్వారా నామినేట్ అయి ఈ పురస్కారం అందుకున్న లెఫ్టినెంట్ జనరల్ బి.ఎస్. ధలీవాల్, ప్రదీప్ చతుర్వేది, సంజయ్ ప్రభాకర్ లొంధే, ప్రొఫెసర్ డాక్టర్ రఘుపత్రుని భీమారావు వంటి ప్రముఖ భారతీయ ఇంజనీర్ల సరసన ఇప్పుడు సూర్యప్రకాష్ చేరారు. ఆయనకు అంతర్జాతీయ పురస్కారం లభించడంపై హైదరాబాద్, తెలంగాణ ఇంజనీరింగ్ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.కావాలంటే దీనికి ఇంకా ఆకట్టుకునే ప్రధాన శీర్షిక, ఉపశీర్షికతో దినపత్రిక శైలిలో కూడా రూపొందిస్తాను.

# తుక్కుగూడ ప్రైమ్ కేర్ ఆస్పత్రిని సీజ్ చేయాలి






- ఇంత జరుగుతున్న ఆస్పత్రిని డిఎంహెచ్ఓ ఎలాంటి విచారణ జరపకపోవడం శోచనీయం
- శిరీష హత్య ఘటనపై ప్రైమ్ కేర్ ఆసుపత్రి ముందు జనసేన ధర్నా
- శిరీష హత్య జరిగిన ఆసుపత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని జనసైనికుల డిమాండ్
- రెండు రోజుల్లో హాస్పిటల్ సీజ్ చేయకపోతే పెద్దఎత్తున పోరాటం చేస్తాం
- జనసేన నాయకుడు సినీ హీరో అల్లాడి తనీష్

మహేశ్వరం, సెప్టెంబర్ 06,( అనంత జనశక్తి )

తుక్కుగూడ ప్రైమ్ కేర్ ఆస్పత్రి పై కేసు నమోదు చేసి సీజ్ చేయాలని జనసేన నాయకుడు సినీ హీరో అల్లాడి తనీష్ అన్నారు. హైదరాబాద్ లో దారుణ హత్యకు గురైన గిరిజన యువతి వూకే శిరీషకు న్యాయం జరగాలంటే ప్రైమ్ కేర్ హాస్పిటల్ ను శాశ్వతంగా సీజ్ చేయాల్సిందేనని సినీ హీరో, జనసేన పార్టీ రాష్ట్ర నేత హీరో అల్లాడి తనీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.హైదరాబాద్ లోని ప్రైమ్ కేర్ హాస్పిటల్ లో నర్సుగా పని చేస్తున్న వూకే శిరీష దారుణ హత్యకు గురైన ఘటనపై ఆదివారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆసుపత్రి ముందు మౌన ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా అల్లాడి తనీష్ మాట్లాడుతూ..ఎక్కడో మారుమూల గ్రామంలో పుట్టిన ఆడబిడ్డ తన తల్లిదండ్రులను చక్కగా చూసుకోవాలనే ఉద్దేశంతో ఎంతో కష్టపడి చదివి నర్సుగా ఉద్యోగం చేస్తోందన్నారు. అలాంటి శిరీష దారుణంగా హత్యకు గురవడం మనసును ఎంతో కలిచివేసిందన్నారు.నిండు నూరేళ్లు నిండకుండానే చిన్న వయసులోనే హాస్పిటల్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా శిరీష మృతి చెందడం బాధాకరమన్నారు. హాస్పిటల్ కి వచ్చిన రోగులను ప్రేమతో, ఆప్యాయతతో పలకరించి ఆరోగ్యం బాగయ్యే వరకు సేవలు చేసే శిరీష మృతి పట్ల ఏమీ పట్టనట్లు యాజమాన్యం వ్యవహరించడం దారుణమన్నారు.

**డిమాండ్లు:**

1. హత్య జరిగిన ప్రైమ్ కేర్ హాస్పిటల్ ను తక్షణమే సీజ్ చేయాలి.
2. ఆసుపత్రి యాజమాన్య నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ జరపాలి.
3. ఎఫ్ఐఆర్ లో హాస్పిటల్ యాజమాన్యం పేరును చేర్చాలి.

మరో రెండు రోజుల్లో ఆసుపత్రిని సీజ్ చేయకపోతే జనసేన పార్టీ పక్షాన ఆసుపత్రి ముందు మరింత పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శిరీషకు న్యాయం జరిగే వరకు జనసేన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

అనంతరం పహాడీషరీఫ్ పోలీసులు వచ్చి ధర్నాను విరమించాలని కోరారు. దీనిపై స్పందించిన జనసేన నేతలు.. శిరీష హాస్పిటల్ క్వార్టర్స్ లోనే హత్యకు గురైతే కనీసం ఎఫ్ఐఆర్ లో హాస్పిటల్ పేరును చేర్చకపోవడం ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్పిటల్ యాజమాన్యం పేరు ఎఫ్ఐఆర్ లో చేరిస్తేనే ధర్నా విరమిస్తామని తెలపడంతో పోలీసులు అందుకు అంగీకరించడంతో తాత్కాలికంగా ధర్నాను విరమించారు .ఈ కార్యక్రమంలో జనసేన తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రేమ్ గాంధీ, శ్రీకాంత్, రాజు నాయక్, డి. చెన్నకేశవులు, ఎం. శివ కుమార్, హైందవ్ రెడ్డి తో పాటు పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొని శిరీష కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# స్పీకర్ పీఠం గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను ఖండించాలి

## - తాతా మధుపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి

హైదరాబాద్ సెప్టెంబర్ 07 అనంత జనశక్తి న్యూస్

తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై శాసనమండలి సభ్యుడు తాతా మధు చేసిన వ్యాఖ్యలను బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి తీవ్రంగా ఖండించారు. స్పీకర్ పీఠం ప్రతిష్టను, శాసనసభ గౌరవాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు.స్పీకర్ కుటుంబ సభ్యులను కించపరిచేలా సామాజిక మాధ్యమాల్లో వ్యాఖ్యలు చేయడం వ్యక్తిగత అవమానం మాత్రమే కాదని, ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తిని అవమానించడమేనని అన్నారు. ప్రజా జీవితంలో ఉన్నవారు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, దళిత వర్గాలను కించపరిచే వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని సూచించారు.తాను 26 ఏళ్లుగా ప్రజా జీవితంలో ఉన్నానని, రెండుసార్లు ఎమ్మెల్యేగా కొనసాగుతున్నానని, 2004, 2009 శాసనసభ సమావేశాలను కూడా చూశానని తెలిపారు. అయితే గతంలో ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు, బెదిరింపు ధోరణిని చూడలేదన్నారు.శాసనమండలి సభ్యుడిగా ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమో సభ ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోరాదని, శాసనసభ, స్పీకర్ పీఠం గౌరవాన్ని కాపాడటం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని స్పష్టం చేశారు.తాతా మధు వ్యాఖ్యలను శాసనసభ తీవ్రంగా ఖండించాలని, రాజ్యాంగం, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, శాసనసభ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఖర్గే ఘటనపై ఎస్సీ, ఎస్టీ ఎంపీల ఫోరం ఏర్పాటు

## ఎస్సీ, ఎస్టీల గౌరవం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం దేశవ్యాప్త పోరాటం: ఎంపీ వంశీకృష్ణ

న్యూఢిల్లీ: సెప్టెంబర్ 7 అనంత జనశక్తి న్యూస్

కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేకు సంబంధించిన ఘటనపై తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన పార్లమెంట్ సభ్యులు సోమవారం న్యూఢిల్లీలోని ఇందిరా భవన్‌లో సమావేశమయ్యారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ సమావేశానికి హాజరయ్యారు.ఎస్సీ, ఎస్టీల గౌరవం, ఆత్మగౌరవం, సమానత్వం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా ఐక్యంగా పనిచేయాలని ఎంపీలు నిర్ణయించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ ఎంపీల ఫోరంను ఏర్పాటు చేసినట్లు వంశీకృష్ణ తెలిపారు.ఖర్గే పర్యటన అనంతరం హల్ద్వానీలో జరిగినట్లు పేర్కొంటున్న 'శుద్ధీకరణ' ఘటనపై ఎంపీలు ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీల పట్ల వివక్ష, అవమానకర వైఖరిని సహించబోమని స్పష్టం చేశారు. ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి వినతిపత్రం సమర్పించాలని నిర్ణయించారు.ఎస్సీ, ఎస్టీల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పార్లమెంట్‌లో, దేశవ్యాప్తంగా ఐక్యంగా పోరాడతామని వంశీకృష్ణ తెలిపారు. వివక్షకు తావులేకుండా సమానత్వం సాధించే వరకు పోరాటం కొనసాగుతుందని అన్నారు.

**కేటీఆర్ తీరుపై వంశీకృష్ణ ఆగ్రహం**

తెలంగాణ అసెంబ్లీలో సోమవారం జరిగిన పరిణామాలపైనా వంశీకృష్ణ స్పందించారు. ప్రతిపక్ష నాయకుడిగా అసెంబ్లీకి హాజరై ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన కేటీఆర్ బయట ధర్నాలు, ఆందోళనలకు పరిమితం కావడం సరికాదన్నారు. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది, మహిళా కానిస్టేబుళ్లతో దురుసుగా వ్యవహరించడం ఖండనీయమన్నారు. విధులు నిర్వహిస్తున్న పోలీసులపై దాడులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ తీరును విమర్శిస్తూ ఆయనకు 'కట్టప్ప' అనే పేరు సరిపోతుందంటూ వ్యాఖ్యానించారు. విద్యార్థులను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవద్దని హితవు పలికారు. అసెంబ్లీలో దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న తమ పార్టీ నేతల విషయంలో కేటీఆర్ ఎందుకు స్పందించడం లేదని వంశీకృష్ణ ప్రశ్నించారు. దళితుల ఆత్మగౌరవం విషయంలో ద్వంద్వ వైఖరిని విడనాడాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీల హక్కులు, గౌరవం కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా

- వెంటనే రేవంత్ రెడ్డి సబితా ఇంద్రారెడ్డికి క్షమాపణలు చెప్పాలి
- అసెంబ్లీ వద్ద ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పట్ల పోలీసుల తీరును ఖండించిన తెలంగాణలో మహిళ ఎమ్మెల్యేలకే రక్షణ లేకపోతే సామాన్య మహిళలకు రక్షణ ఉంటుందా
- హర్షగూడ మాజీ ఉపసర్పంచ్ రవి నాయక్

మహేశ్వరం, సెప్టెంబర్ 06,( అనంత జనశక్తి)



కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా అని హర్షగూడ మాజీ ఉపసర్పంచ్ రవి నాయక్ తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈరోజు తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు మొదటి రోజు ప్రారంభమౌతున్న సందర్భంగా మాజీమంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పై పోలీసుల తీరు పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి ఎమ్మెల్యే సీనియర్ నాయకురాలైన సబితా ఇంద్రారెడ్డి పైన పోలీసులు వ్యవహరించిన తీరు దారుణంగా ఉందని మహిళా ఎమ్మెల్యే పైనే పోలీసుల ప్రవర్తిస్తే ఇక రాష్ట్రంలో ఉన్న సామాన్య మహిళల పరిస్థితి ఏంటి అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు ఎక్కడ రక్షణ లేకుండా పోయిందని ఆయన అన్నారు. తక్షణమే రేవంత్ రెడ్డి సబితా ఇంద్రారెడ్డికి క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా ప్రజాపాలన అంటే ఇదేనా అని ఆయన ప్రశ్నించారు. ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులు చేసిన పనికి రాష్ట్రంలో ఉన్న సభ్య సమాజం సిగ్గు పడింది అన్నారు. తెలంగాణ రాష్ట్ర మహిళలు కాంగ్రెస్ ప్రభుత్వ చేసిన తీరుకు సిగ్గుపడుతున్నారని ఆయన అన్నారు. తక్షణమే రేవంత్ రెడ్డి ప్రభుత్వం సబితా ఇంద్రారెడ్డికి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రాజకీయాలు నైతిక విలువలతో ఉండాలని నీచ రాజకీయాలు చేయకూడదని అని అన్నారు.



# మలబద్ధకంతో విసిగిపోయారా, ఇప్పుడు చెప్పేవి తీసుకుంటే కడుపు మొత్తం ఖాళీ అవ్వాల్సిందే

సరైన ఆహారం తీసుకోకపోవడం, ఒత్తిడి పెరగడం, పోషకాహారం తీసుకోకపోవడం, నిద్ర లేమి, నీరు ఎక్కువగా తాగకపోవడం ఇలాంటి ఎన్నో కారణాల వల్ల చాలా మందికి మలబద్ధకం సమస్య ఉంటుంది. దీనిని నేచురల్‌గా దూరం చేసుకునేందుకు కొన్ని ఇంటి చిట్కాలు హెల్ప్ చేస్తాయని చాలా మంది జీరా వాటర్, గోరువెచ్చని నీరు తాగుతారు. అయితే, దాని బదులు, మరికొన్ని మంచి టిప్స్ ఉన్నాయని వీటిని ఫాలో అయితే ఎలాంటి మెడిసిన్ వాడకుండానే కాన్స్టిపేషన్ తగ్గుతుందని న్యూట్రిషనిస్ట్ శ్వేతా షా చెబుతున్నారు. అలాంటి టిప్స్ ఏంటో తెలుసుకోండి.



**జీరా వాటర్ బదులు**

చాలా బదులు జీర్ణ సమస్యలు రాగానే జీరా వాటర్, వేడి నీరు తాగడం చేస్తుంటారు. అలా కాకుండా ఈ సారి కొద్దిగా గోరువెచ్చని నీటిలో నెయ్యిని కలిపి తాగి చూడండి. దీంతో మలం మృదువుగా మారుతుంది. దీంతో మలవిసర్జన సాఫీగా జరుగుతుంది. నెయ్యి నేచురల్ లాక్సేటీవ్‌గా పనిచేస్తుంది. దీనిని తీసుకోవడం వల్ల మలం మొత్తం మృదువుగా మారి మల విసర్జన సరిగా జరుగుతుంది. దీంతో బవెల్ మూమెంట్స్ సరిగా ఉంటాయి. దీనికోసం ఓ కప్పు గోరువెచ్చని నీరు లేదా పాలలో 1 టీస్పూన్ నెయ్యి వేసి కలిపి పరగడపున తాగండి. దీని వల్ల చాలా వరకూ మలబద్ధకం దూరమవుతుంది.

**ఇసబ్‌గోల్ బదులు ప్రూన్స్**

చాలా మంది ఇసబ్‌గోల్‌ని మలబద్ధకాన్ని తగ్గించేందుకు వాడతారు. అయితే, ఇది అందరికీ అందుబాటులో ఉండదు. ఉన్నా కూడా దీనికంటే మెరుగైనది తీసుకోవాలనుకుంటే ప్రూన్స్ పండ్లు తీసుకోండి. ఇవి కూడా నేచురల్ లాక్సేటీవ్ గుణాలని కలిగి ఉండి గట్ హెల్త్‌ని సరిగ్గా చేస్తాయి. ప్రూన్స్ పండ్లలో హై ఫైబర్, నేచురల్ షుగర్ ఆల్కహాల్ గుణమైన సార్బిటోల్ ఉంటుంది. దీని వల్ల స్టూల్ సాఫ్ట్ అవుతుంది. బవెల్ మూమెంట్స్ పెరుగుతాయి. రోజుకి 5 నుంచి 8 ప్రూన్స్ పండ్లు తింట నీరు ఎక్కువగా తాగండి. ఆటోమేటిగ్గా కాన్స్టిపేషన్ తగ్గుతుంది.

**బొప్పాయి**

మలబద్ధకాన్ని దూరం చేయడంలో బొప్పాయి చాలా బాగా పనిచేస్తుంది. దీనిని తినడం వల్ల బవెల్ మూమెంట్స్ పెరుగుతాయి. బొప్పాయి తినడం వల్ల మలబద్ధకం చాలా వరకూ తగ్గుతుంది. ఇందులోని ఫైబర్, నీటిశాతం పపైన్ అనే ఎంజైమ్ మలబద్ధకాన్ని దూరం చేస్తుంది. ఇందులోని సోల్యూబుల్ ఫైబర్ స్టూల్‌ని బయటికెళ్లేలా చేస్తుంది. పపైన్ ప్రోటీన్స్‌ని బ్రేక్ చేస్తుంది. జీర్ణ వ్యవస్థని ఈజీ చేస్తుంది. దీంతో బవెల్ మూమెంట్స్ పెరుగుతాయి. అందుకోసం బాగా పండిన బొప్పాయి పండుని తీసుకోవడం మంచిది.

**పాల బదులు ఆముదం నీరు**

పాలు అందరికీ పడకపోవచ్చు. కొంతమందికి దీని వల్ల జీర్ణం లేట్‌గా అవుతుంది. అలా కాకుండా గోరువెచ్చని నీటిలో హాఫ్ టీస్పూన్ ఆముదాన్ని కలిపి నిద్రపోయేముందు తాగండి. దీంతో కోలన్ క్లెన్స్ అవుతుంది. గోరువెచ్చని నీటిలో మనం ఆముదం కలిపి తాగడం వల్ల చాలా వరకూ మలబద్ధకం తగ్గుతుంది. ఇందులోని లాక్సేటీవ్ గుణాలు మలబద్ధకాన్ని తగ్గిస్తాయి. ఆముదాన్ని తీసుకోవడం వల్ల మజిల్స్ స్టిమ్యులేట్ అవుతాయి. కడుపు మొత్తం క్లీన్ అవుతుంది. మలబద్ధకం తగ్గుతుంది.

**వీటితో పాటు**

ఎక్కువగా ఫైబర్ ఫుడ్స్ తీసుకోవాలి. కూరగాయలు, పండ్లు, చిక్కుళ్లు, నట్స్, హోల్ గ్రెయిన్స్, ఓట్స్, బ్రౌన్ రైస్ వంటివి తీసుకోవాలి.

ఎక్కువగా నీరు తాగాలి. రోజుకి కనీసం 8 నుంచి 10 కప్పుల వరకూ తీసుకోవాలి.

ప్రోబయోటిక్స్ అయిన పెరుగు, కెఫిర్ వంటివి తీసుకుంటే జీర్ణ వ్యవస్థ మెరుగ్గా మారుతుంది.

ఒమేగా 3 రిచ్ ఫుడ్స్ తీసుకోవాలి. చేపలు, అవకాడో, అవిసెలు తీసుకోవాలి.

అంతేకాకుండా, రెగ్యులర్‌గా వర్కౌట్ చేయాలి.



# ముదిరాజ్ లను బీసీ 'డీ' నుంచి బీసీ 'ఏ' లోకి మార్చాలి

- రాష్ట్రంలో ఎక్కువ జనాభా శాతం కలిగిన ముదిరాజులు
- రేవంత్ రెడ్డి పై నమ్మకం విశ్వాసం ఉంది ముదిరాజులకు న్యాయం చేయాలి
- ముదిరాజ్ సంఘం పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గదగూటి మహేందర్ ముదిరాజ్

**మహేశ్వరం, సెప్టెంబర్ 07,( అనంత జనశక్తి )**



వెనుకబడి ఉన్న ముదిరాజ్ కులస్తులను బీసీ 'డీ' నుంచి బీసీ 'ఏ' లోకి మార్చాలని ముదిరాజ్ సంఘం పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గదగూటి మహేందర్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మహేశ్వరం మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మహేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు వెంటనే ముదిరాజ్ లను బీసీఏ లోకి చేర్చాలని కోరారు.

**జనాభాకు తగ్గ ప్రాతినిధ్యం లేదు:**
రాష్ట్రంలోనే మూడో అతిపెద్ద సామాజిక వర్గంగా, బీసీల్లో రెండో పెద్ద కులంగా ఉన్న ముదిరాజ్ లు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాజా కులగణన సర్వే ప్రకారం రాష్ట్ర జనాభాలో ముదిరాజ్ లు 7.4 శాతం ఉన్నారు, అంటే దాదాపు 60 లక్షల మంది వరకు ఉన్నారని, గణాంకాలు చెబుతున్నా విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యంలో తగిన వాటా దక్కడం లేదన్నారు.రాష్ట్రంలో ఉన్న 4 వేల మత్స్యకార సొసైటీల్లో 3,200 సొసైటీలు ముదిరాజ్ ల చేతుల్లోనే ఉన్నప్పటికీ, ఆర్థికంగా వారు నిలదొక్కుకోలేకపోతున్నారని తెలిపారు. పేదరికం కారణంగా ముదిరాజ్ బిడ్డలు కనీస డిగ్రీ కూడా పూర్తి చేయలేని పరిస్థితిలో ఉన్నారని, సాంకేతిక విద్య అందని ద్రాక్షగానే మిగిలిందన్నారు.

**బీసీ కమిషన్ ద్వారా సమగ్ర అధ్యయనం చేయాలి:**
ఇది ఎవరికీ వ్యతిరేకమైన డిమాండ్ కాదని, సామాజిక న్యాయం కోసం చేస్తున్న న్యాయమైన పోరాటమని స్పష్టం చేశారు. ముదిరాజ్ సమాజం యొక్క సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులపై బీసీ కమిషన్ ద్వారా సమగ్ర అధ్యయనం నిర్వహించాలని కోరారు.జనాభా, ఉద్యోగాలు, విద్య, ఆర్థిక స్థితి, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని, రాజ్యాంగబద్ధమైన విధానంలో న్యాయమైన నిర్ణయం తీసుకోవాలని, కోర్టుల్లో ఎలాంటి అడ్డంకులు రాకుండా జీవో విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాల్లో ముదిరాజ్ కులస్తులకు ప్రాధాన్యం కల్పించి, భావితరాలకు న్యాయం చేయాలని, రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన ఈ వర్గం అన్ని రంగాల్లో రాణించేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా తీవ్రంగా

# ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు చేయాలని డిమాండ్ : బిఆర్ఎస్

**హైదరాబాద్ సెప్టెంబర్ 7 అనంత జనశక్తి న్యూస్**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చెయ్యాలని బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆదేశాల మేరకు,
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుతో కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ సమర భేరి
అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం చంద్రాయణగుట్ట నియోజకవర్గ ఇంచార్జ్ సీతారాం రెడ్డి, సభ్యత్వ నమోదు ఇంచార్జ్ సాయి షాహిన్ అఫ్రోజ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ఇంచార్జ్ సాయి షాహిన్ అఫ్రోజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు కావస్తున్నా ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, తులం బంగారం, ఆడబిడ్డలకు స్కూటీలు, రైతులకు రూ.15 వేల రైతు భరోసా, నిరుద్యోగ భృతి వంటి హామీలను ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. బీఆర్ఎస్ ఉద్యమ నాయకుడు ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఆరు గ్యారంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పి, వెయ్యి రోజులు గడుస్తున్నా వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. ప్రజాక్షేత్రంలో ఏ రాజకీయ పదవీ శాశ్వతం కాదని, రాబోయే రోజుల్లో ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి సమాధానం చెబుతారని పేర్కొన్నారు. అనంతరం ప్రజావాణిలో తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జీహెచ్ఎంసీ కార్యాలయ సిబ్బందికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జమ్మిచెట్టు రాజు, సీహెచ్ సరిత, నరేష్ కుమార్, ఫిరోజ్ ఖాన్, షేక్ మొహమ్మద్ ఫజల్, ఇమ్రాన్ సుల్తాన్ మీర్జా, సాయి నాగమణి, అలివేలు తదితరులతో పాటు మహిళా విభాగం, యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల వ్యవహారశైలి ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ

- మాజీ మహిళా కమిషన్ సభ్యురాలు షాయిన్ అఫ్రోజ్ తీవ్ర ఆగ్రహం

**హైదరాబాద్ సెప్టెంబర్ 07 అనంత జనశక్తి న్యూస్**

మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల వ్యవహారశైలి ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అని మాజీ మహిళా కమిషన్ సభ్యురాలు షాయిన్ అఫ్రోజ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం మహిళా ఎమ్మెల్యేలు నల్ల చీరలు ధరించి నిరసన వ్యక్తం చేసినందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులతో వారిపై దాడి చేయించడం సిగ్గుచేటని ఆమె విమర్శించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు భారత ప్రజాస్వామ్యానికి మాయని మచ్చగా నిలుస్తుందని అన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కూడా అణచివేసే విధంగా ప్రభుత్వం వ్యవహరించడం పూర్తిగా అవమానకరమని మండిపడ్డారు.తెలంగాణలో కీచక పర్వం మొదలైందని, ఇక శ్రీకృష్ణుడు త్వరలోనే వచ్చి, రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని పారదోలుతాడు అంటూ ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మహిళల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని మార్చుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. తెలంగాణలో నలుపు రంగును నిషేధించినట్లు ఎందుకు వ్యవహరిస్తున్నారని ఆమె ప్రశ్నించారు. నలుపు రంగు కేవలం పార్లమెంట్‌లో మాత్రమే ధరించడానికి అనుమతిస్తారా అంటూ ప్రభుత్వ తీరుపై ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి తన వైఖరిని మార్చుకోకపోతే మహిషాసుర సంహారం జరుగుతుందని ఆమె హెచ్చరించారు. మహిళల గౌరవం, ప్రజాస్వామ్య హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.



# ఎన్టీఆర్ నగర్లో బస్తీ దర్బార్


- సోషల్ జస్టిస్ పార్టీ వినూత్న కార్యక్రమం
- బస్తీ వాసుల వద్దకు పార్టీ.

**ఎల్బీనగర్ సెప్టెంబర్ 07 అనంత జనశక్తి న్యూస్**



హైదరాబాద్ నగరంలో బస్తీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్న ఉద్దేశంతో సోషల్ జస్టిస్ పార్టీ వినూత్న కార్యక్రమం చేపట్టింది. బస్తీ దర్బార్ సర్కార్ వద్దకు సామాన్యుల గళం పేరిట మంగళవారం నాడు ఉదయం తొమ్మిది గంటలకు ఎన్టీఆర్ నగర్లోని దుర్గా వద్ద కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి ఏర్పుల బాలస్వామి తెలిపారు. సోమవారం నాడు ఇక్కడ ఆయన ఒక పత్రిక ప్రకటన విడుదల చేస్తూ బస్తీలు ఏర్పడి దశాబ్దాలు పూర్తికావస్తున్న బస్తి ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటివరకు పరిపాలించిన బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు బస్తీ ప్రజలను ఓట్ బ్యాంకులుగా వాడుతున్నారు తప్ప వారి సమస్యలు పరిష్కరించలేదని చెప్పారు. ఇంటి స్థలాలకు పట్టాలు, బస్తీ ప్రజలు ఎదుర్కొంటున్న కనీస వసతుల కల్పన, బస్తీ వాసుల సమస్యలు, పారిశుద్య సమస్యలు వంటి మరెన్నో ఉన్నాయని వాటి గురించి తెలుసుకొని సంబంధిత అధికారులకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి సోషల్ జస్టిస్ పార్టీ కృషి చేస్తుందని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్టీఆర్ నగర్లో అనేక రకాల సమస్యలు ఉన్నాయని అవన్నీ తెలుసుకుని పరిష్కరించేంత వరకు ప్రభుత్వంపై పోరాటం చేస్తుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ అధ్యక్షులు చామకూర రాజు తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ కె.వి గౌడ్ హైదరాబాద్ హైడ్రా ఏరియా ఇంచార్జ్ వరంగల్ రమేష్, అధికార ప్రతినిధి ప్రశాంత్ మహర్షి, సహాయ కార్యదర్శి సతీష్ మహాజన్, రాపాక వెంకట్దివ్యాంగ్ విభాగ అధ్యక్షులు ఎమ్మెస్ యాదవ్ తదితరులు పాల్గొ పాల్గొంటారని వారు తెలిపారు. బస్తి ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సమస్యలు తెలియజేసి విజయవంతం చేయాల్సిందిగా వారు కోరారు.

# కాంగ్రెస్ ఎన్నికల హామీలను అమలు చేయాలి



**సరూర్ నగర్ సెప్టెంబర్ 7 అనంత జనశక్తి న్యూస్**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని భారస నాయకులు డిమాండ్ చేశారు.ఎన్నికల సమయంలో 100 రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి, నేటికీ అనేక హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు.ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను అమలు చేసి ప్రజలకు రావాల్సిన ప్రయోజనాలను అందించాలని కోరుతూ సరూర్ నగర్ తహసిల్దార్ వేణు గోపాల్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆడబిడ్డలకు మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, తులం బంగారం, రైతులకు రైతు భరోసా, ప్రతి పంటకు బోనస్, 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్ వంటి హామీలను నెరవేర్చాలి. రైతు కూలీల సంక్షేమానికి రూ.12,000 సహాయం, ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలి. అర్హులైన నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి, ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ అమలు చేయాలి. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12,000 ఆర్థిక సహాయం అందించాలి. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్ రెడ్డి,జిట్టా రాజశేఖర్ రెడ్డి,భవాని ప్రవీణ్ కుమార్,పద్మానాయక్,సాగర్ రెడ్డి,జిన్నారం విఠల్ రెడ్డి,డివిజన్ అధ్యక్షులు చిరంజీవి,వరప్రసాద్ రెడ్డి,సత్యంచారి,శ్రీశైలం యాదవ్,రాజిరెడ్డి,తోట మహేష్ యాదవ్,జక్కిడి మల్లారెడ్డి , పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంత జనశక్తి

మంగళవారం | రంగారెడ్డి
08.09.2026



## బిగ్‌బాస్ కంటెస్టెంట్ సంపాదనపై సల్మాన్ షాక్!





బిగ్‌బాస్ రియాలిటీ షో హిందీ వెర్షన్‌కు ప్రముఖ నటుడు సల్మాన్ ఖాన్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా మొదలైన 20వ సీజన్ )కు వచ్చిన ఓ కంటెస్టెంట్, గేమింగ్ వీడియోల ద్వారా తనకొచ్చే నెలవారీ సంపాదనను వెల్లడించాడు. ఆ మొత్తం విని సల్మాన్ షాక్ అయ్యారు.





గేమింగ్ వీడియోలు, వ్లాగ్‌ల ద్వారా పాపులర్ అయిన తన్మయ్ సింగ్ ఈ సీజన్‌లో పోటీపడుతున్నాడు. 'స్కాట్‌ఆప్' పేరుతో యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్న తన్మయ్‌కి 50 లక్షల మందికి పైగా సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. బిగ్‌బాస్ హౌస్‌లోకి ఎంట్రీ ఇస్తున్న సమయంలో సల్మాన్ అతణ్ని వీక్షకులకు పరిచయం చేశారు. ఈ సం ద ర్భంగా గేమింగ్ వీడియోల ద్వారా నెలకు ఎంత ఆర్జిస్తున్నారని తన్మయ్‌ని అడిగారు. తన ఆదాయం గురించి అతడు సల్మాన్ చెవిలో చెప్పగా షాక్ అయ్యారు. 'ఏంటి.. నెలకు రూ.30 లక్షలు సంపాదిస్తున్నావా' అని ఆశ్చర్యపోయారు. 'అదంతా వైట్ మనీనే. చెక్కుల రూపంలోనే నాకు వస్తుంది' అని తన్మయ్ వివరించారు

## ఆప్యాయంగా చేయి వేస్తే తప్పా... హార్దిక్‌తో డేటింగ్ ట్రోల్స్‌పై నటి కౌంటర్

టీమ్ ఇండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాతో తాను డేటింగ్‌లో ఉన్నట్లు జరుగుతోన్న ప్రచారంపై సీనియర్ నటి అమీషా పటేల్ తీవ్రంగా స్పందించారు. ముంబయిలో ఇటీవల జరిగిన ఓ వేడుకలో హార్దిక్ భుజంపై అమీషా చేయి వేసి పలకరించిన వీడియో వైరల్ కావడంతో, వారిద్దరి మధ్య రిలేషన్ ఉందంటూ ఒక నెటిజన్ పోస్ట్ చేసిన వీడియోపై ఆమె రిప్లై ఇచ్చారు.

"నీకు గర్ల్‌ఫ్రెండ్ లేదని అర్థమవుతోంది. అందుకే ఒక అమ్మాయి సాధారణంగా పలకరించినా అందులో తప్పు వెతుకుతున్నావు. ఆప్యాయంగా చేయి వేసినా కూడా దాన్ని లవ్, డేటింగ్ అని భావిస్తున్నారు. ముందు నువ్వు ఒక గర్ల్‌ఫ్రెండ్‌ని వెతుక్కో, ఆ తర్వాత ఇలాంటి ఊహాగానాలు ప్రచారం చేయచ్చు" అని ఆమె ఘాటుగా సమాధానమిచ్చారు. తన స్నేహితులను





హార్దిక్‌కు పరిచయం చేయడానికి మాత్రమే తాను అక్కడికి వెళ్లానని స్పష్టం చేశారు. ఇప్పటికే హార్దిక్ పాండ్యా నటి మహీకా శర్మతో ప్రేమలో ఉన్న విషయం తెలిసిందే. ఇటీవల కూడా వీరిద్దరూ ఓ ఖరీదైన కారులో ఔటింగ్‌కు వెళ్లిన వీడియోలు వైరల్ అయ్యాయి.

## బిగ్‌బాస్‌లోకి మేరీ కోమ్.. స్పెషల్ విషెస్ చెప్పిన ప్రియాంకా చోప్రా

ఐదుసార్లు వరల్డ్ ఛాంపియన్‌గా నిలిచిన ప్రముఖ బాక్సింగ్ దిగ్గజం మేరీకోమ్ బిగ్ బాస్ 20వ సీజన్‌లో కంటెస్టెంట్‌గా అడుగుపెట్టారు. సెప్టెంబర్ 6న ఘనంగా ప్రారంభమైన ఈ హిందీ రియాలిటీ షోలో ఆమె రాబోయే 105 ఎపిసోడ్లు హౌస్‌లో గడపనున్నారు. ఈ సందర్భంగా బాలీవుడ్ స్టార్ ప్రియాంకా చోప్రాఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ వీడియో విడుదల చేశారు.

మేరీకోమ్‌తో ప్రియాంకకు ప్రత్యేక అనుబంధం ఉన్న విషయం తెలిసిందే. 2014లో తెరకెక్కిన ఈ బాక్సర్ బయోపిక్‌లో ప్రియాంక ప్రధాన పాత్రలో నటించి మెప్పించారు. అప్పటి నుంచి వీరి మధ్య స్నేహం కొనసాగుతోంది. తాజాగా ఆమె బిగ్‌బాస్‌లోకి వెళ్లడంతో ఈ షోలో పాల్గొన్న ఇతర కంటెస్టెంట్లను ఉద్దేశించి ప్రియాంక మాట్లాడుతూ.. "మేరీకోమ్ మన దేశానికి గర్వకారణం. బిగ్ బాస్ 20లోఆమె ప్రయాణం అద్భుతంగా సాగాలని కోరుకుంటున్నాను. అయితే, హౌస్‌లోని ఇతర కంటెస్టెంట్లు ఆమె పంచ్‌లతో కాస్త అప్రమత్తంగా ఉండడం మంచిది" అని సరదాగా చెప్పారు.

గతంలో మేరీకోమ్ బయోపిక్ షూటింగ్ సమయాన్ని ప్రియాంక గుర్తు చేసుకుంటూ.. "నా కెరీర్‌లోనే అత్యంత కష్టమైన చిత్రం. ఒక ఫైటర్‌గా, గృహిణిగా, అలాగే తల్లిగా నటించడం నాకు సవాలుగా అనిపించింది. ఒక చిన్న గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన మేరీకోమ్.. క్రీడారంగంలో ఎదురయ్యే సవాళ్లను దాటుకుని ఈ స్థాయికి చేరుకోవడం అభినందనీయం" అని చెప్పారు . ఒమంగ్ కుమార్ దర్శకత్వంలో, సంజయ్ లీలా



భన్సాలీ నిర్మించిన 'మేరీకోమ్' సినిమా.. ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా 62వ జాతీయ చలనచిత్ర పురస్కారాన్ని గెలుచుకుంది.

## ప్రియాంక కొత్త ప్రయాణం

ప్రియాంక కొత్త ప్రయాణంవైవిధ్యమైన కథలు, పాత్రలతో దక్షిణాదిలో మంచి క్రేజ్‌ను సంపాదించుకుంది కథానాయిక ప్రియాంక మోహన్. గతేడాది 'ఓజీ' సినిమాతో తెరపై మెరిసిన ఈమె.. ఇప్పుడు మరో కొత్త చిత్రాన్ని గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆమె, కథానాయకుడు జై ప్రధాన పాత్రల్లో ఓ సినిమాలో నటిస్తున్నారు. దీనికి ఎంఎస్ ఆనందన్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ ప్రాజెక్టును అధికారికంగా ప్రకటిస్తూ... సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టింది ప్రియాంక. "ఒక ఉత్కంఠభరితమైన కొత్త ప్రయాణం మొదలవుతోంది" అనే వ్యాఖ్యను జోడించింది. ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని క్రైమ్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దుతున్నట్లు, త్వరలో నటీనటులకు సంబంధిం చిన పూర్తి వివరాల్ని వెల్లడించనున్నట్లు చిత్రవర్గాలు తెలిపాయి. ఇందులో యోగిబాబు కీలక పాత్రలో నటిస్తున్నారు.



## షఫాలీ వర్మ ఔట్ తర్వాత పాక్ కెప్టెన్ చేష్టలు.. ఐసీసీ చర్యలు




ఇటీవల భారత్‌తో మ్యాచ్ లో షఫాలీ వర్మ వికెట్ తీశాక పాకిస్థాన్ కెప్టెన్ ఫాతిమా సనా సంబరాలు చేసుకున్న తీరు చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆమె వ్యవహార శైలిని ఐసీసీ తీవ్రంగా పరిగణించింది. ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని 'లెవల్ 1'ను ఉల్లంఘించినందుకుగానూ ఆమె మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా విధించింది.

అదే విధంగా సనా ఖాతాలో ఒక డీమెరిట్ పాయింట్ కూడా చేరింది. 24 నెలల వ్యవధిలో ఆమెకు ఇది రెండో డీమెరిట్ పాయింట్ కావడం గమనార్హం. గత ఏడాది ఆగస్టు 6న ఐర్లాండ్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో ఒక డీమెరిట్ పాయింట్ పడింది. అంపైర్ ఔట్ అని ప్రకటించినప్పటికీ క్రీజును వదిలి వెళ్లేందుకు నిరాకరించడంతో ఐసీసీ ఈమేరకు చర్యలు తీసుకుంది.

మహిళల ఆసియా కప్‌లో భాగంగా ఇటీవల భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో పాక్ 55 పరుగులకే కుప్పకూలింది. భారత్ 8.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఈ లక్ష్యాన్ని ఛేదించింది. ఇన్నింగ్స్‌ను సిక్సర్‌తో ప్రారంభించి దూకుడు మీదున్న షఫాలీ వర్మ 12 పరుగులు చేసి.. ఫాతిమా సనాకు కాట్ అండ్ బౌల్డ్‌గా వికెట్ సమర్పించుకొంది. ఈ క్రమంలో పెవిలియన్ వైపు చేయి చూపిస్తూ ఫాతిమా సంబరాలు చేసుకొంది.

## దులీప్ ట్రోఫీ ఫైనల్.. ఇషాన్ కిషన్ డబుల్ సెంచరీ

ఫ్టైనెస్‌తో తాను మరింత ప్రమాదకరంగా మారతానని భారత యువ బ్యాటర్ ఇషాన్ కిషన్ నిరూపించాడు. సౌత్ జోన్‌తో జరుగుతున్న దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో ఇషాన్ (270) అద్భుతమైన డబుల్ సెంచరీ సాధించాడు. ఓవర్ నైట్ స్కోరు 385/4తో రెండో రోజు ఆట ప్రారంభించిన ఈస్ట్ జోన్.. 163 ఓవర్లకు 708 పరుగుల వద్ద ఆలౌటయ్యింది. దీంతో రెండో రోజు ఆట ముగిసింది. కుమార్ కుశాగ్ర (101) సెంచరీ చేసి పెవిలియన్‌కు చేరాడు. కుశాగ్ర ఔటైన అనంతరం క్రీజ్‌లోకి వచ్చిన అనుకుల్ రాయ్ (45)తో కలిసి ఇషాన్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. దూకుడుగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. కేవలం 24 ఓవర్లలోనే వీరిద్దరూ కలిసి ఆరో వికెట్‌కు శతక భాగస్వామ్యం నిర్మించడం గమనార్హం. సౌత్ జోన్ బౌలర్లలో త్రిపురన విజయ్ నాలుగు వికెట్లు, మిలింద్, శ్రేయస్ గోపాల్ చెరో రెండు వికెట్లు, షేక్ రషీద్ ఒక వికెట్ తీశారు.

## ఓటమిని తప్పించుకున్న భారత్

జూనియర్ ఆసియాకప్ హాకీ టోర్నమెంట్ తొలి మ్యాచ్‌లో ఇండోనేసియాను 14-0తో చిత్తు చిత్తుగా ఓడించిన భారత పురుషుల జట్టు.. ఆదివారం జపాన్‌తో రెండో మ్యాచ్‌లో కొద్దిలో ఓటమిని తప్పించుకుంది. ఆఖరి నిమిషంలో గోల్‌తో 3-3తో డ్రా చేసుకుంది. పూల్-ఎ పోరులో ఆరంభంలో ఆధిక్యంలో కొనసాగిన అన్మోల్ బృందం.. తర్వాత పట్టు కోల్పోయి ప్రత్యర్థికి పుంజుకునే అవకాశాన్ని ఇచ్చింది. తొలి క్వార్టర్ మొదట్లో పెనాల్టీ స్ట్రోక్‌తో అన్మోల్ (4వ నిమిషం) గోల్ కొట్టడంతో భారత్ 1-0తో నిలిచింది. కాసేపటికే ఆధిక్యం రెట్టింపైంది. అషు మౌర్య (10వ) పెనాల్టీ కార్నర్‌ను సద్వినియోగం చేశాడు. కానీ జపాన్ వెంటనే పుంజుకుంది. రయుషిన్ ససాకి (11వ) గోల్‌తో 1-2తో నిలిచింది. తర్వాతి రెండు క్వార్టర్లలో భారత్-జపాన్ గోల్స్ కోసం గట్టిగానే పోరాడినా ఫినిషింగ్ చేయలేకపోయాయి. ఆఖరి క్వార్టర్‌లో కెప్టెన్ నకనిషి (48వ) సఫలం కావడంతో జపాన్ స్కోరు సమం చేసింది. కాసేపటికే ఆ జట్టు ఖాతాలో మరో గోల్ చేరింది. నకనిషి (59వ) గోల్‌తో జపాన్ 3-2తో విజయానికి చేరువైంది. ఇంకో 59 సెకన్లలో మ్యాచ్ ముగుస్తుందనగా భారత్‌కు పెనాల్టీ కార్నర్ దక్కింది. ఆ అవకాశాన్ని కెప్టెన్ అన్మోల్ సద్వినియోగం చేసి భారత్‌ను ఓటమి నుంచి బయటపడేశాడు. మంగళవారం కొరియాతో భారత్ తలపడనుంది.

అమ్మాయిలకు ఘనవిజయం: మహిళల జూనియర్ ఆసియాకప్ టోర్నీలో భారత్ వరుసగా రెండో విజయాన్ని అందుకుంది. ఆదివారం జరిగిన పోరులో 11-1తో మలేసియాను చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో ఆద్యంతం ఆధిపత్యం ప్రదర్శించిన భారత్.. గోల్ మీద గోల్ కొట్టింది. తొలి నిమిషం



నుంచి ఆఖరిదాకా అదే జోరు కొనసాగించింది. పూజ సాహో (1వ, 42వ), పూర్ణిమ యాదవ్ (4వ, 17వ), గీత యాదవ్ (28వ, 53వ), సనిక మానె (43వ, 58వ) రెండేసి గోల్స్ కొట్టగా.. బినిమా ధాన్ (8వ), కృష్ణ శర్మ (14వ), సుఖ్‌వీర్ కౌర్ (21వ) ఒక్కో గోల్ సాధించారు. మలేసియా తరఫున ఏకైక గోల్‌ను నూర్ మహ్మద్ (38వ) చేసింది.

## కుర్రాళ్లు కుమ్మేశారు..

సాత్విక్, చిరాగ్ జోడీకి చైనా మాస్టర్స్ టైటిల్

సాత్విక్ సాయిరాజు, చిరాగ్ శెట్టి జంట అదరగొట్టింది. కెరీర్లో తొలిసారిగా చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ సూపర్ 750 టైటిల్‌ను చేజిక్కించుకుంది. ఆదివారం హోరాహోరీగా సాగిన ఫైనల్లో సాత్విక్, చిరాగ్ గొప్పగా పుంజుకుంటూ.. ఛాంపియన్లుగా నిలిచారు. ఈ సీజన్లో ఈ జోడీకిది రెండో టైటిల్.

షెంజెన్

గత నెల సొంతగడ్డపై జరిగిన ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్స్‌లో నిరాశపరిచిన సాత్విక్ సాయిరాజు, చిరాగ్ శెట్టి జోడీ.. ఇప్పుడు స్థాయికి తగ్గ ప్రదర్శనతో చైనా మాస్టర్స్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఈ భారత స్టార్ బ్యాడ్మింటన్ జోడీ, ఆదివారం జరిగిన ఫైనల్లో 11-21, 21-13, 21-17తో చైనాకు చెందిన ప్రపంచ మాజీ నంబర్ 4 జంట హె జి టింగ్, రెన్ జియాంగ్ యుల విజయం సాధించింది. సాత్విక్-చిరాగ్ జంట ఈ టోర్నీలో 2023, 2025లో రన్నరప్‌గా నిలిచింది. ఈ ద్వయం ఈ ఏడాది మేలో సింగపూర్ ఓపెన్ సూపర్ 750 టైటిల్‌ను గెలుచుకుంది. ఆసియా క్రీడల్లో స్వర్ణాన్ని నిలబెట్టుకోవాలనే లక్ష్యంతో ఉన్న సాత్విక్, చిరాగ్ ద్వయానికి ఈ టైటిల్ మరింత ఉత్తేజాన్నిస్తుందనడంలో సందేహం లేదు.

వెనుకబడి..: చైనాతో జంటతో గతంలో తలపడ్డ రెండు సార్లూ పైచేయి సాధించిన సాత్విక్, చిరాగ్ జంట.. ఈసారి తడబాటుగా ఆరంభించింది. మొదట్లో ర్యాలీలపై నియంత్రణ సాధించలేకపోయింది. ఎటాకింగ్ గేమ్‌తో టింగ్-రెన్ ద్వయం 5-0తో ఆధిక్యంలోకి దూసుకుపోయింది. కట్టుదిట్టంగా సర్వీస్ చేసింది. టింగ్ స్మాష్‌తో చైనా జోడీ 8-3తో నిలిచింది. వాళ్ల డిఫెన్స్‌ను ఛేదించడానికి భారత ద్వయం ప్రయత్నించింది. కానీ దూకుడు ప్రదర్శించిన ప్రత్యర్థి జంట.. విరామానికి ఆరు పాయింట్ల ఆధిక్యంలో నిలిచింది. ఆ తర్వాత ఆధిక్యాన్ని 14-7కు పెంచుకుంది. క్రమంగా 17-9కు చేరుకున్న చైనా జోడీ.. అలవోకగా తొలి గేమ్‌ను సొంతం చేసుకుంది. కానీ రెండో గేమ్‌లో సాత్విక్-చిరాగ్ ద్వయం అద్భుతంగా పుంజుకుంది. డిఫెన్స్‌ను బలోపేతం చేసుకున్న ఈ భారత జంట, ర్యాలీలను పొడిగించింది. సాత్విక్ చక్కగా సర్వ్ చేశాడు. గేమ్ నువ్వానేనా అన్నట్లు మొదలైంది. ప్రత్యర్థి శరీరానికి చిరాగ్ కొట్టిన స్మాష్‌తో భారత జంట 9-6తో ఆధిక్యంలో నిలిచింది. ఆ జోడీకి వరుసగా లభించిన అయిదో పాయింట్ అది. కానీ సాత్విక్ సర్వీస్ తప్పిదంతో ఆ వరుసకు తెరపడింది. అయితే తిరిగి పట్టుబిగించిన భారత జంట.. విరామానికి నాలుగు పాయింట్ల ఆధిక్యం సంపాదించింది. తొలి గేమ్‌లో చాలా ర్యాలీలు 15 షాట్ల లోపే ముగిశాయి. కానీ రెండో గేమ్‌లో భారత జంట ర్యాలీని పొడిగించడంతో చైనా ద్వయం ప్రతి పాయింట్ కోసం కష్టపడాల్సివచ్చింది. ఓ 45 షాట్ల ర్యాలీలో పైచేయి సాధించిన సాత్విక్-చిరాగ్ జోడీ 12-8తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత 17-11కు చేరుకుంది. అదే జోరును కొనసాగిస్తూ, ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆ గేమ్‌ను గెలుచుకుని, ఫైనల్‌ను మూడో గేమ్‌ను తీసుకెళ్లింది. నిర్ణయాత్మక గేమ్ రసవత్తరంగా సాగింది. బలంగా పుంజుకున్న చైనా జంట 4-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత 7-3తో నిలిచింది. కానీ సాత్విక్, చిరాగ్ ద్వయం క్రమంగా జోరందుకుంది. 7-7తో స్కోరు సమం చేసింది. విరామానికి చైనా జంట రెండు పాయింట్ల ఆధిక్యంలోకి నిలిచింది. విరామం తర్వాత రెండు జంటలు హోరాహోరీ ర్యాలీలు ఆడాయి. చైనా జోడీ 12-15తో ఆధిక్యంలో సంపాదించింది. కానీ పుంజుకున్న చిరాగ్-సాత్విక్ ద్వయం 16-16తో స్కోరు సమం చేసింది. చైనా జంట వెంటనే 17-16తో నిలిచింది. కానీ భారత జోడీ వరుసగా అయిదు పాయింట్లు నెగ్గి గేమ్‌ను, టైటిల్‌ను సొంతం చేసుకుంది.




PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945